మంగళవారం
05-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 14
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

విప్లవ వీరుడికి వందనం

తెలుగుజాతి యుగపురుషుడు అల్లూరి

- అల్లూరి నడయాడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం
- అల్లూరి విగ్రహోష్కరణ సభలో ప్రధాని మోదీ

విశాలాంధ్ర బ్యూరో–ఏలూరు: తెలుగు జాతి యుగపురుషుడు అల్లూరి సీతారామరాజు అని ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరం ఏఎస్‌ఆర్ నగర్‌లో సోమవారం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా మోదీ హాజరయ్యారు. 30 అడుగుల అల్లూరి సీతారామ రాజు కాంస్య విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. మోదీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను, విప్లవవీరుని పోరాటానికి గుర్తుగా విల్లు, బాణం బహూకరించారు. అల్లూరి సీతారామరాజు, మల్లుదొర వారసులను మోదీ, జగన్ సత్కరించారు. తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా అంటూ మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించారు. అల్లూరి నడయాడిన నేలపై మనం నడవటం అదృష్టమని మోదీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పుణ్యభూమి, వీరభూమి అన్నారు. ఈ పుణ్యభూమికి రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వీర భూమికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. తెలుగు గడ్డపై ఎందరో మహనీయులు జన్మించారని కొనియాడారు. ఆదివాసీ ప్రజలను చైతన్య పరిచిన అల్లూరి...బ్రిటీష్ పాలకులపై సాగించిన పోరాటం భారతదేశానికే స్ఫూర్తిదా యకంగా నిలిచిందన్నారు. సీతారామరాజు, ఆయన నేతృత్వంలో పోరాడిన మన్యం వీరుల బలిదానాలకు తాను శిరస్సు వంచి నమస్కరిస్తూ దేశం ప్రజలందరి తరపున కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నానని చెప్పారు. దేశం ఆజాదీకా అమృత మహోత్సవం జరుపుకుం టున్న ఈ సంవత్సరమే అల్లూరి సీతారామరాజు 125వ జయంతి, రంప సాయుధపోరాట శతవార్షికోత్సవం రావడం అపురూప సందర్భమని, ఈ వేడుకలను రానున్న ఏడాది పాటు ఘనంగా నిర్వహిస్తామని ప్రధానమంత్రి తెలిపారు. ఇందులో భాగంగా సీతారామరాజు పుట్టిన పాండ్రంగి గ్రామాన్ని, సాయుధ పోరాటానికి నాంది పలికిన చింతపల్లి పోలీసుస్టేషన్‌లను స్మృతి ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అల్లూరి నివసించిన మోగల్లు గ్రామంలో అల్లూరి స్మారక ధ్యాన మందిరం నిర్మిస్తామన్నారు. స్వాతంత్ర్య సంగ్రామం ఏదో ఒక ప్రాంతానికి, ప్రజలకు సంబంధించినది కాదని, దేశ ప్రజలలో స్వేచ్ఛా కాంక్షను నింపిన ఘట్టమన్నారు. ఆంధ్రప్రదేశ్ కన్నెగంటి హనుమంతు, కందుకూరి వీరేశలింగం పంతులు, పొట్టి శ్రీరాములు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి మహనీయులకు పురిటి గడ్డని, పింగళి వెంకయ్య దేశానికి మువ్వన్నెల పతాకాన్ని అందించారన్నారు. వారి స్వప్నాల సాకారానికి కృషి చేద్దామన్నారు. అల్లూరి జయఘోష పిలుపు 'మనదే రాజ్యం' వందేమాతరం నినాదానికి సరితూగే నినాదమన్నారు. 'నేను వస్తున్నా..దమ్ముంటే ఆపండి' అని ముందే చెప్పి దాడి చేసిన అల్లూరి తెగువ నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. దేశం నవశకం ముంగిట నిలిచిన వేళ ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు, కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువతకు ఇటువంటి ధైర్యసాహసాలు అవసరమన్నారు. పరాయి పాలకులు తమ సంస్కృతిని రూపు మాపేందుకు ఎంతగా దాడులు చేసినా ఆదివాసీలు ఎదురొడ్డి నిలిచారని, ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు మ్యుజియం ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివాసీల వికాసం, అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం కృషి

- మిగతా 2 లో

జగన్ పంతం నెగ్గింది!

3 లో

మోదీకి నిరసన సెగ

- హోదా, విభజన హామీల సాధన సమితి ఆందోళన
- రామకృష్ణ, చలసాని, బాబూరావు అరెస్టు
- కేంద్రంపై జగన్ ఒత్తిడి పెంచాలి: రామకృష్ణ
- నల్లబెలూన్లతో కాంగ్రెస్ నిరసన

మోదీ పర్యటనకు నిరసన తెలుపుతున్న రామకృష్ణను అరెస్టుచేసిన పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి నిరసన సెగ తగిలింది. మోదీ పర్యటనను నిరసిస్తూ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్వర్యంలో సోమవారం విజయవాడ లెనిన్‌సెంటర్‌లో ఆందోళనలు జరిగాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొని, అరెస్టయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ సందర్భంగా మోదీ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి గురించి గంభీరంగా ప్రసంగించారనీ, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల గురించి, వాటి కోసం పోరాడిన వీరుల గురించి ఉపన్యాసాలు దంచికొట్టారన్నారు. నిజంగా బీజేపీలో మిగతా నాయకులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయా?, దేశంలో పత్రికలకు, ఛానెళ్లకు స్వేచ్ఛా స్వాతం త్ర్యాలు ఉన్నాయా?, సామాజిక ఉద్యమకారులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయా? అని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయా? పాలకుల లోపాలను ప్రశ్నిస్తున్న వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించి వేస్తూ...వాటి గొప్పదనం గురించి ప్రసంగించడానికి ఇంతదూరం వచ్చారా? అని మోదీని ప్రశ్నించారు. ఏపీకి అడుగడుగునా ద్రోహం చేసి ఏ ముఖం పెట్టుకుని మన్యం వీరుడు అల్లూరి విగ్రహావిష్క రణకు విచ్చేశారని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలయ్యేంత వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికీ, కేంద్రీయ విద్యాసంస్థలు, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు తదితర హామీలకు కేంద్ర ప్రభుత్వం తగు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వానికి రాష్ట్రాభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి పెంచి ప్రత్యేక హోదా సాధించాల న్నారు. కేంద్ర ప్రభుత్వ మోసంపై నిరసన తెలుపు తుంటే పోలీసులతో జగన్ సర్కార్ అరెస్టు చేయిం చడాన్ని తప్పుబట్టారు. చలసాని శ్రీనివాస్, సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ మోదీ కనీసం రాష్ట్రం వైపు చూడబోరనీ, ఇక్కడి బీజేపీ నాయకులను ఖాతరు చేయబోరన్నారు. రాష్ట్ర ప్రజలకు కేంద్రం

- మిగతా 2 లో

ఓట్ల కోసమే బీజేపీ అల్లూరి జపం

- గిరిజన హక్కుల కోసం పోరాడిన వీరుడు అల్లూరి
- అల్లూరిని ఒక కులానికి పరిమితం చేయడం సిగ్గుచేటు
- సీతారామరాజు స్ఫూర్తితో సమరశీల పోరాటాలు సాగిస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- విజయవాడలో అల్లూరి విగ్రహానికి వామపక్షాల ఘన నివాళి

3 లో

ప్రధాని మోదీకి వినతిపత్రం అందజేస్తున్న సీఎం జగన్

హోదాపై మొక్కుబడి

- ప్రధానికి సీఎం జగన్ వినతిపత్రం
- విభజనతో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటనను పురస్కరించుకుని ప్రతిపక్షాలు పెద్దఎత్తున నిరసనకు దిగడంతో, సీఎం జగన్ వ్యూహాత్మకంగా వ్యవహరిం చారు. గన్నవరం విమానాశ్రయంలో ప్రధాన మంత్రికి వీడ్కోలు పలుకుతూ... అదే సమయంలో రాష్ట్రానికి సంబంధించి అపరిష్కృత సమస్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞాపన పత్రం అందజేశారు. దానిలో ప్రత్యేక హోదా అంశాన్ని చేర్చి తాను ఆ డిమాండ్‌ను వదలిపెట్టలేదనిపించు కునే ప్రయత్నం

- మిగతా 2 లో

ఇక పాలూ భారమే...

- పాల ఉత్పత్తులపై జీఎస్టీ రైతులకు శరాఘాతం
- కేంద్రం తీరుపై అన్నదాతల ఆగ్రహం
- పాడి పరిశ్రమను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే చర్యగా విమర్శ

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టీ)లో ఇటీవల తీసుకువచ్చిన మార్పులు ఇప్పటికే ద్రవ్యోల్బణం దాటికి అతలాకుతలమైన సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఏమాత్రం ఉపశమనం కలిగించడంలేదు. సహకార సమాఖ్యను ధ్వంసం చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జీఎస్టీని శక్తిమంతమైన సాధనంగా ఉపయోగిస్తోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పాల ఉత్పత్తులపై జీఎస్టీని ప్రవేశపెట్టాలన్న జీఎస్టీ మండలి నిర్ణయంపై అన్న దాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాల ఉత్పత్తులపై ఐదు శాతం జీఎస్టీ విధించాలనీ, పాల యంత్రాలతో సహా డెయిరీ మెషనరీపై 12 శాతం నుంచి 18 శాతం వరకు పన్ను రేటును పెంచాలని జీఎస్టీ 47వ కౌన్సిల్ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులు పాల ఉత్పత్తిపై ఆధారపడిన తొమ్మిది కోట్ల వ్యవసాయ కుటుంబాలపై ప్రభావం చూపుతా యని రైతు నాయకులు పేర్కొన్నారు. బీజేపీ సర్కారు తీరును తీవ్రంగా తప్పుబట్టారు. పాడి పరిశ్రమను కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నంగా ఈ చర్యను అభివర్ణిస్తున్నారు. జీఎస్టీ విధానం గత ఐదేండ్లలో పేద రైతులు, చిన్న పారిశ్రామికవేత్తలపై ప్రతికూల ప్రభావం చూపిందనీ, గుత్తాధిపత్య సంస్థల వర్గ ప్రయోజనాలకు అనుకూలంగా ఉండే ఆర్థిక విధానాలకు దారి తీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. డెయిరీ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రవేశపెట్టే నిర్ణయం చిన్న డెయిరీలు, అన్నదాతలకు 'శరాఘాతం' అని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారు. 75 శాతం గ్రామీణ కుటుంబాలు రెండు నుంచి నాలుగు ఆవులను కలిగి ఉన్నాయి. అట్టడుగు సామాజిక వర్గాలకు చెందిన మహిళలు, రైతులు పాడి పరిశ్రమపై ఎక్కువగా ఆధారపడుతు న్నారు. తొమ్మిది కోట్ల వ్యవసాయ కుటుంబాలకు ఈ రంగం ఆర్థిక ప్రాముఖ్యతను చూపుతుంది. జీఎస్టీలో ఇటీవలి మార్పులు ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణ ఒత్తిడితో కొట్టుమిట్టాడుతున్న ప్రాథమిక ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు ప్రయోజనం కలిగించవు. ధరల పెరుగుదల అణగారిన తరగతి ప్రజల పోషకాహార అవసరాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది" అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో కేంద్రానికి పరిస్థితిపై ఏమాత్రం అవగాహనలేదని ఈ చర్య ద్వారా తెలుస్తోందని విమర్శకులు పేర్కొంటున్నారు. దేశంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న పాలలో ఎక్కువ భాగం ఫెడరేషన్ల ద్వారా వినియోగదారులకు అందుతున్నాయి. ఈ ఫెడరేషన్లు జీఎస్టీ భారాన్ని వినియోగదారులు, రైతులపై మోపుతాయి. ఇప్పటికే పశుగ్రాసం, మందులు, ఇతర ఇన్‌పుట్ ఖర్చులు

- మిగతా 2 లో

ఆగని రూపాయి పతనం

- రికార్డు కనిష్ఠానికి క్షీణత
- డాలర్‌తో 79 చేరువలో నమోదు

ముంబై: అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ తీవ్ర అగాథంలోకి పడిపోతోంది. దేశ చరిత్రలో ఇది వరకు ఎన్నడూ లేని విధంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా రూ.79 చేరువలో నమోదైంది. సోమవారం డాలర్‌తో రూపాయి విలువ శనివారం నాటితో పోల్చుకుంటే మరో పైసా కోల్పోయి 78.95కు దిగజారింది. ఇది రికార్డు కనిష్ఠం. ఉదయం 78.97 వద్ద

- మిగతా 2 లో

శ్రీలంకలో స్కూళ్లు వారం బంద్

2 లో

ఇదీ లోకం!

ప్రైవేట్‌లో ఫీజుల వాత!

ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల వాత పెట్టడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. కొన్ని గంటల్లో బడిగంట మోగనుండడంతో గుండెల్లో దడ పుడుతుందని అంటున్నారు. అమ్మఒడి ఆశించినా సర్కారు మెలికపెట్టి నిరాశపర్చడంతో అప్పులు చేసి మరీ తమ చిన్నారులకు ఫీజులు చెల్లించేందుకు మానసికంగా సిద్ధమైపోయారు. విద్యాసంబంధిత పరికరాలు అడగబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా ఉండడంతో ఏం చేయాలో పాలుపోక తికమక పడుతున్నారు. విద్యే భవిష్యత్‌కు పునాది, బంగారు బాటకు సోపానమంటూ ప్రభుత్వం ఊకదంపుడు ప్రసంగాలు చేస్తున్నా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలులో విఫలం చెందిందంటున్నారు. తరగతి తరగతికీ ఫీజుల్లో వ్యత్యాసం ఉండడంతో యాజమాన్యాల బాదుడుకు తల్లిదండ్రులు బావురుమంటున్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా విద్యావ్యవస్థను గాడిన పెట్టడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు.

విద్యాసంస్థల్లో అమలుకాని చట్టం

- అందని ద్రాక్షగా అమ్మఒడి
- 'ఒక్క అవకాశం'పై పేదల నిరాశ
- కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర–డిజిటల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకపో వడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు తమ ఇష్టానుసారం ఫీజులు పెంచేస్తున్నాయి. పిలిచిమరీ ఫీజులవాత పెట్టడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నా మని చెప్పుకునే ప్రభుత్వం అసలు ప్రైవేట్ పాఠశాలల్లో ఏం జరుగుతుందో తెలుసు కునే ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మఒడి అందని ద్రాక్షగా మిగిలిపోవడంతో ఆశలు అడియాశలయ్యాయంటున్నారు. వేడినీళ్లకు చన్నీళ్లన్నట్టుగా ఫీజులకు ఉపయోగ పడుతుందను కుంటే హాజరుశాతంతో మెలికిపెట్టి ప్రభుత్వం మోసం చేసిందని

- మిగతా 2 లో

డెన్మార్క్ షాపింగ్ మాల్‌లో కాల్పులు

- ముగ్గురి మృతి - ఒకరి అరెస్టు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

కోపెన్‌హాగెన్: డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్ ఉలిక్కిపడింది. అక్కడి షాపింగ్ మాల్‌లో ఓ సాయుధుడు విచక్షణారహితంగా కాల్పులు జరుపగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది గాయాలయ్యాయి. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. సిటీ సెంటర్, విమానాశ్రయం మధ్య ఉన్న అమేగర్ జిల్లాలోని పెద్ద ఫీల్డ్ మాల్ చుట్టూ పోలీసు బలగాలను మోహరించినట్లు కోపెన్‌హాగన్ పోలీసులు ట్వీట్ చేశారు. కాల్పుల సమయంలో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. జనం భయంతో బయటకు పరుగులు తీశారు. అత్యాధునిక ఆయుధంతో ఇష్టారీత్యా కాల్పులు జరిపిన 22 ఏళ్ల నోవా ఎస్బెన్సన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు చనిపోగా మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, పదుల సంఖ్యలో జనం గాయపడ్డారని పోలీసులు చెప్పారు. మృతుల సంఖ్య పెరగవచ్చునన్నారు. కాల్పుల సమయంలో ప్రజలు పారిపోతున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉగ్రకోణాన్ని దర్యాప్తు చేయగా అదేమీ లేదని తేలినట్లు అధికారులు వెల్లడించారు. కాల్పులకు ఎందుకు తెగబడ్డాడన్న విషయం తేలలేదని, నిందితుడిని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇదిలావుంటే, కాల్పులు జరిగిన ప్రాంతానికి సమీపంలోని రాయల్ ఎరీనాలో ఓ వేడుకతో పాటు డెన్మార్క్ రాజు ఫ్రెడ్రిక్ ఫ్రాన్స్ సైక్లింగ్ బృందంతో జరగాల్సిన విందు కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇది చాలా తీవ్రమైన ఘటన అని కోపెన్‌హాగెన్ మేయర్ సోఫీ హెచ్.అండర్‌సన్ అన్నారు. కోపెన్‌హాగెన్ కాల్పుల ఘటనను దేశ ప్రధాని మెటే ఫ్రెడరిక్సన్ తీవ్రంగా ఖండించారు.

చైనాలో భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 5.2 తీవ్రత నమోదు

బీజింగ్: చైనాలో ఆదివారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై తీవ్రత 5.2గా నమోదు అయినట్లు చైనా భూకంప నెట్వర్కుల కేంద్రం (సీఈఎన్సీ) వెల్లడించింది. వాయువ్య చైనాలోని అక్కీ కౌంటీలో ఉదయం 6:02 గంటలకు (బీజింగ్ కాలమానం ప్రకారం) భూకంపం సంభవించింది. భూకంప కేంద్రం 10 కి.మీ లోతులో ఉందని సీఈఎన్సీ పేర్కొన్నట్లు జిన్హువా వెల్లడించింది. శనివారం తెల్లవారుజామున 3:29 గంటలకు చైనాలోని జిన్ జియాంగ్ ప్రాంతంలో 4.3 తీవ్రతతో భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. నైరుతి చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని మెర్కాంగ్ సిటీ ఆఫ్ అబా టిబెటన్-కియాంగ్ అటానమస్ ప్రిఫెక్చర్‌లో శుక్రవారం ఉదయం 00:03 గంటలకు (బీజింగ్ కాలమానం ప్రకారం) 5.8 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు సీఈఎన్సీ తెలిపింది. ఇదిలావుంటే శనివారం 04:55 గంటలకు దక్షిణ ఇరాన్‌లో 6.2 తీవ్రతతో, శనివారం తెల్లవారుజామున 6.1 తీవ్రతతో భూకంపం సంభవించగా ఐదుగురు మరణించారు. 12 మంది ఆసుపత్రి పాలయ్యారని ఇరాన్ గల్ఫ్ తీరంలోని హోర్మోజ్గాన్ ప్రావిన్స్‌లో అత్యవసర నిర్వహణ అధిపతి మెహర్దాద్ హసన్జాదే వెల్లడించారు.

శ్రీలంకలో స్కూళ్లు వారం బంద్

కొలంబో: శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. అన్ని వస్తువుల కొరత నెలకొంది. ఇంధన సంక్షోభం తీవ్రం కావడంతో విద్యాసంస్థలకు జులై 4వ తేదీ నుంచి వారం రోజుల పాటు సెలవులను శ్రీలంక విద్యాశాఖ ప్రకటించింది. బడులు తెరుచుకున్న తర్వాత సిలబస్‌ను పూర్తి చేస్తారని తెలిపింది. జూన్ 18న కూడా అన్ని పాఠశాలలను వారం రోజుల పాటు మూసివేయడం విదితమే. కొలంబో నగర పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ ప్రైవేటు పాఠశాలలను వారం రోజుల పాటు మూసివేయాలని విద్యుత్, ఇంధన కొరతే కారణమని విద్యాశాఖ వెల్లడించినట్లు డైలీ మిర్రర్ పేర్కొంది. విద్యాశాఖ కార్యదర్శి నిహాల్ రణసింఘె ఇదే విషయమై స్పందిస్తూ ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని స్కూళ్లకు సూచించినట్లు తెలిపారు. రవాణా కష్టాలు లేకపోతే గనుక టీచర్లు, విద్యార్థులు, ప్రిన్సిపాల్‌పై సంక్షోభ ప్రభావం లేనిపరిస్థితుల్లో తక్కువ మంది విద్యార్థులతో తరగతులను నిర్వహించవచ్చు అని జిల్లా స్థాయి స్కూళ్లకు సంబంధించి రణసింఘె వెల్లడించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ కోతలు ఉండరాదని, తద్వారా ఆన్‌లైన్ బోధనకు వారంతాల్లో అవకాశం ఉంటుందని పబ్లిక్ యుటిలిటీస్ కమిషన్, శ్రీలంక (పీయూసీఎస్ఎల్) నిర్ణయించినట్లు డైలీ మిర్రర్ నివేదించింది.

చలసాని శ్రీనివాస్, రవీంద్రనాథ్, బాబూరావు, కోటేశ్వరరావును అరెస్టుచేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మోదీకి నిరసన సెగ

(మొదటిపేజీ తరువాయి)

చాలా విషయాల్లో బకాయిపడి ఉందనీ, ఇప్పటికైనా రాష్ట్రానికి దక్కాల్సిన హామీలు నెరవేర్చాలన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రమాణాలు చేసి, మాట తప్పిన ఘనత మోదీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదాపై ప్రస్తావన చేసే అర్హత కూడా మాకు లేదా? అని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ ఎన్టీఆర్‌జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు బి.రవిచంద్ర పాల్గొన్నారు.

నల్ల బెలూన్లతో కాంగ్రెస్ నిరసన

మోదీ పర్యటనకు నిరసనగా గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఓ భవనం నుంచి కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరసా రాజీవ్‌రతన్ నేతృత్వంలో యువకులు నల్లబెలూన్లు ఎగురవేసి, వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రత్యేక హోదాపై రాష్ట్రాన్ని దగా చేసిన మోదీ పర్యటనను అడ్డుకుని, నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతామని పరసా రాజీవ్‌రతన్ ఇటీవల ప్రకటించారు. మోదీ పర్యటన సందర్భంగా తొలుత గన్నవరం విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, ఎమ్మార్పీఎస్ నేతలు నిరసనకు యత్నించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి, సుంకర పద్మశ్రీతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బెలూన్ల ఎగురవేతకు పిలుపునిచ్చిన పరసా రాజీవ్‌రతన్ కోసం వెతుకుతున్నామని డీఎస్పీ విజయ్‌పాల్ చెప్పారు. కాంగ్రెస్ నిరసనలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు మండిపడ్డారు. హెలికాప్టర్ సమీపంలో బెలూన్లు ఎగురవేయడం వెనక కుట్ర దాగి ఉందని, మోదీపై కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. మోదీ గో బ్యాక్ అంటూ నినదిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సాకే శైలజానాథ్‌ను రాజమండ్రి సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు.

అక్రమ అరెస్టులకు వామపక్షాల ఖండన

ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ రద్దు, రాజధాని, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు తదితర అంశాలపై ప్రధాని ప్రకటన చేయనందుకు శాంతియుతంగా విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసన చేసిన వామపక్ష, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సోమవారం సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వై.సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నాయకులు కాటం నాగభూష ణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఎన్.మూర్తి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్‌యూసీఐ(సీ) నాయకులు బీఎస్ అమర్‌నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు పీవీ సుందర రామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకులు జానకిరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. మోదీ రాకకు నిరసనగా ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని వామపక్షాలు ఖండించాయి. వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హోదాపై మొక్కుబడి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. వైసీపీకి చెందిన పార్లమెంటు సభ్యులను ఎక్కువమందిని గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని గత ఎన్నికల సందర్భంగా జగన్ ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే 22 ఎంపీ స్థానాలను వైసీపీ గెలుచుకున్నప్పటికీ జగన్ కేంద్రంపై పోరాటం చేయకపోగా, కేంద్రానికి సాగిలపడుతూ వస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. సోమవారం ప్రధాని పర్యటన సందర్భంగా కూడా ముఖ్యమంత్రి తన విజ్ఞాపన పత్రంలో కీలకమైన ప్రత్యేక హోదా అంశాన్ని చేర్చి మరో మారు అడిగానని అనిపించుకున్నారు. అది కూడా విజ్ఞాపన పత్రంలో చివరి అంశం కావడం గమనార్హం. ఇక దీంతో పాటు రీసోర్సు గ్యాప్ గ్రాంటు అంశాన్ని విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. రూ.34,125.5 కోట్ల ను రీసోర్స్ గ్యాప్ కింద గ్రాంటుగా ఇవ్వాలని, తెలంగాణ డిస్కంలనుంచి ఏపీ జెన్‌కోకు రావాల్సిన రూ.6,627.28 కోట్లను ఇప్పించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాల ప్రకారం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రాష్ట్రానికి ఇస్తున్న రేషన్ విషయంలో హేతు బద్ధత లేని కారణంగా రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని, దానిని సవరించి రాష్ట్రానికి మేలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్యకళాశాలకు తగిన ఆర్థిక సహాయం చేయాలని, భోగాపురం ఎయిర్‌పోర్టుకు సంబంధించిన అనుమతులు మంజూరుచేయాలని, ఏపీఎండీసీకి ఇనుప గనులు కేటాయించాలని సీఎం కోరారు.

ఇక పాలూ భారమే...

(మొదటిపేజీ తరువాయి)

భారీగా పెరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే పశుగ్రాసం ధరలు క్వింటాల్‌కు రూ. 800 నుంచి రూ. 1600కి పెరిగాయి. రైతుల ఆదాయం ఏ మాత్రం పెరగలేదు. జీఎస్టీ భారం కూడా పడితే రైతుల ఆర్థిక పరిస్థితి మరింత ఘోరంగా తయారవుతుందని రైతు సంఘం నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆగని రూపాయి పతనం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమై రోజంతా ఒత్తిడికి గురైంది. మధ్యలో 79.06కు విలువ కోల్పోయింది. చివరికి రూ. 78.95 వద్ద ముగిసింది. భారత్‌లోనూ మందగమన భయాలు, అధిక చమురు ధరలు, అంతర్జాతీయ ప్రతికూల అంశాలు, ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడం, ఆర్బీఐ వద్ద మారకం నిల్వలు తగ్గిపోవడం తదితర అంశాలు రూపాయిని కుదేలు చేస్తున్నాయి.

హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం

విద్యార్థులు సహా 13 మంది మృతి

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని కులూ జిల్లాలో చోటు చేసుకున్న బస్సు ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. షైన్‌షేర్ నుంచి కులుకు వెళుతున్న ప్రైవేట్ బస్సు సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో జంగ్లా గ్రామ సమీపంలోని లోయలో పడిపోవడంతో ఈ ఘోర ప్రమాదం జరిగినట్టు కులు అదనపు కమిషనర్ అశుతోశ్ గార్గ్ తెలిపారు. ఈ ప్రమాదంలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులతో సహా మొత్తం 13 మంది మరణించినట్టు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తరుణంలో బస్సులో 45 మంది వరకూ ఉన్నట్టు తెలుస్తోంది. ప్రమాదంలో మృతి చెందిన వారిలో ప్రేమ్‌చంద్, తను, ఫతే చంద్, అనితా దేవి, సుశీల్ కుమార్, ఖిమ్ దాసి, రోషి దేవి, పార్వతి దేవి, జబ్లూ దేవి, అమిత్ కుమార్ రజక్, అక్షి, రాఖీ మాయ లుగా గుర్తించారు. గాయపడిన మహేందర్ సింగ్, సంజయ్ కుమార్, బస్సు కండక్టర్ గోపాల్‌లను చికిత్స నిమిత్తం కులు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. విద్యార్థుల మృతి తనను బాధించిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించనున్నట్టు ప్రధాని మోదీ కార్యాలయం ట్వీట్ చేసింది. ఈ ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించామని హిమాచల్ సీఎం జై రామ్ ఠాకూర్ తెలిపారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పు, గాయపడ్డవారికి తక్షణ సాయం కింద రూ.15 వేలు అందించనున్నట్టు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్యాక్‌చేసి లేబుల్ వేసిన ఆహారంపై జీఎస్టీ భారం

- ఆహార ధాన్యాల వ్యాపారులకు నష్టం
- నిత్యావసర ధరలు సైతం పెరుగుతాయి
- సీఏఐటీ ఆందోళన

న్యూఢిల్లీ: ప్యాక్ చేసిన, లేబుల్ చేసిన ఆహార పదార్థాలపై 5 శాతం జీఎస్టీ విధించాలనే నిర్ణయం ఆహార ధాన్యాల వ్యాపారులకు నష్టదాయకమని, ఈ నిర్ణయం బ్రాండెడ్ కాని రోజువారీ నిత్యావసరాల ధరలను పెరగడానికి దారి తీస్తుందని అఖిలభారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిందిగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు జీఎస్‌టీ మండలికి విజ్ఞప్తి చేస్తామని పేర్కొంది. లెవీని హేతుబద్ధీకరించడానికి మినహాయింపులను ఉపసంహరించుకోవడంపై రాష్ట్రాల మంత్రుల బృందం చేసిన వివిధ సిఫార్సులను జీఎస్టీ కౌన్సిల్ గత వారం ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఇప్పుడు మాంసం, చేపలు, పెరుగు, పన్నీర్, తేనె వంటి ప్యాక్ చేసి, లేబుల్ వేసిన ఆహార పదార్థాలపై జీఎస్టీ వర్తించనుంది. జీఎస్టీ మండలి తీసుకున్న ఈ నిర్ణయానికి నిరసనగా వ్యాపారుల ప్రతినిధి బృందం రాష్ట్రాల ఆర్థిక మంత్రులను కలిసి మెమోరాండం అందజేస్తుందని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. ప్యాక్, లేబుల్ చేసిన ఆహార పదార్థాలను 5 శాతం జీఎస్టీ పన్ను శ్లాబ్‌లో తీసుకురావాలన్న జీఎస్టీ మండలి సిఫార్సుపై ఆహార ధాన్యాల వ్యాపారులలో ఆగ్రహం నెలకొందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఆహారధాన్యాల వ్యాపారులకు ఇది భారీ నష్టం కలిగిస్తుందని ఆయన చెప్పారు. 'ఈ నిర్ణయం చిన్న తయారీదారులు, వ్యాపారుల మార్కెట్‌ను స్వాధీనం చేసుకునేందుకు పెద్ద బ్రాండ్‌లకు అధికారం ఇస్తుంది. ఇప్పటి వరకు బ్రాండ్ కాని ప్రత్యేక ఆహార పదార్థాలు, తృణ ధాన్యాలు మొదలైనవాటికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఉంది. మండలి తాజా నిర్ణయంతో ప్యాకింగ్ చేసిన, లేబుల్ వేసిన పెరుగు, లస్సీ, మజ్జిగతో సహా ఇతర రిటైల్ ప్యాక్‌లపై జీఎస్టీ వర్తిస్తుందని ఖండేల్‌వాల్ చెప్పారు. సీఏఐటీ జాతీయ అధ్యక్షుడు బీసీ భర్తియా మాట్లాడుతూ... ఈ నిర్ణయం వ్యాపారులకు సమ్మతి, ఖర్చుల భారాన్ని పెంచడమే కాక మరోవైపు, అవసరమైన ప్రాథమిక వస్తువులు కూడా ఖరీదైనవిగా మారతాయన్నారు. 'ఈ నిర్ణయం ప్రకారం... ఇప్పుడు కిరాణా దుకాణదారుడు కూడా ఏదైనా గుర్తుతో ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను విక్రయిస్తే, అతను ఆ ఆహార వస్తువుపై జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

తాజ్ మహల్‌లో విగ్రహాలు లేవు

ఆర్‌టీఐ ప్రశ్నకు సమాధానమిచ్చిన భారత పురావస్తుశాఖ

న్యూఢిల్లీ: ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్ మహల్‌లో హిందూ దేవతా విగ్రహాలున్నాయని బీజేపీ నేతలు చేస్తున్నవి వట్టి ఆరోపణలేనని తేటతెల్లమైంది. ఆగ్రాలో ఉన్న తాజ్‌మహల్ పునాదుల్లోని 22 గదులున్నాయని, నేల మాళిగల్లో హిందూ దేవతల విగ్రహాలున్నాయని జరుగుతున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని భారత పురావస్తుశాఖ (ఏఎస్ఐ) తేల్చి చెప్పింది. మరిన్ని వివరాల్లోకి వెళితే హిందుత్వ శక్తులు పని గట్టుకుని మసీదుల కింద ఆలయాలున్నాయంటూ ప్రచారం చేస్తున్న క్రమంలో బీజేపీ మీడియా ఇంఛార్జి రమేశ్‌కుమార్ తాజ్ మహల్ కింద హిందూ దేవతల విగ్రహాలున్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అక్కడితో ఆగకుండా మూసి ఉన్న గదులను తెరిచేలా ఆదేశించాలని అలహాబాద్ హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ క్రమంలో తృణమూల్ కాంగ్రెస్ నేత సాకేత్ గోఖలే తాజ్ మహల్ కింద ఉన్న గదుల్లో విగ్రహాలు ఉన్నాయా లేవా అనే విషయాన్ని స్పష్టం చేయాలని సమాచార చట్టం కింద చేసిన దరఖాస్తునకు భారత పురావస్తు శాఖ అక్కడ విగ్రహాలు లేవని చాలా స్పష్టమైన సమాధానం ఇచ్చింది. అక్కడ ఏ గదులు మూసివేయలేదని వాటికి సంబంధించిన ఫోటోలను కూడా విడుదల చేసింది. అసలు తాజ్ మహల్ అనేది ఏ మతానికి సంబంధించిన ఆలయం కాదని ఎస్ఐఏ ఆగ్రా చీఫ్ ఆర్‌కే పటేల్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా బీజేపీ నేత దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి అలహాబాద్ హైకోర్టు కూడా నిరాకరించిన విషయం తెలిసిందే.

విప్లవ వీరుడికి వందనం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోందని, స్కిల్ ఇండియా కార్యక్రమం ద్వారా వారి నైపుణ్యాలకు, కళలకు మంచి గుర్తింపు తెచ్చి అదాయవనరులు కల్పిస్తున్నామని తెలిపారు. ఆదివాసాలు వెదురు కోసుకోవాలన్న వీలులేని పాత చట్టాలను మార్చి, అటవీ సంపదపై హక్కులు కల్పించామన్నారు. కనీస మద్దతు ధర పరిధిలోకి 90 అటవీ ఉత్పత్తులు తెచ్చామని తెలిపారు. 30 వేల వనధన సంపద కేంద్రాలు, 750 ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు.

అందుకే అల్లూరి పేరుతో జిల్లా: సీఎం జగన్

ముఖ్యమంత్రి వైయస్ జగన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తికావస్తున్న తరుణంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. అల్లూరి సీతారామరాజు125వ జయంతిని పురస్కరించుకుని ఆ మహాయోధుడి విగ్రహాన్ని ఆవిష్కరించడానికి భీమవరం వచ్చిన ప్రధాని మోదీకి, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి, వేదిక మీద ఉన్న తన మంత్రివర్గ సహచరులకు, సోదరుడు చిరంజీవికి, ఇతర పెద్దలకు, మిత్రులందరికీ స్వాగతం పలుకుతున్నానన్నారు. మన గడ్డమీద మన పూర్వీకులు, మన స్వాతంత్ర్య సమరయోధులు వారి భవిష్యత్తుని, జీవితాన్ని, రక్తాన్ని ధారపోసి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చారన్నారు. అలాంటి స్వాతంత్ర్యం అమృతంతో సమానమని జగన్ అన్నారు. స్వాతంత్ర్యం కోసం లక్షలాది మంది ప్రాణాలు పణంగా పెట్టారన్నారు. వారి త్యాగాల ఫలితమే నేటి మన భారతదేశమని వ్యాఖ్యానించారు. ఈ రాష్ట్రం మట్టి నుంచి, ఇక్కడ ప్రజల నుంచి అనేక అగ్నికణాలు పుట్టాయన్నారు. అటువంటి త్యాగధనుల్లో, పోరాటయోధులలో ఒక మహా అగ్నికణం ఈ రాష్ట్రంలో పుట్టిన అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అడవిలో కూడా అగ్గి పుట్టించిన ఆ యోధుడు, సామాజిక ఐకమత్యం అవసరాన్ని తెలియజెప్పిన సంస్కర్త. భావాలపరంగా ఎన్నటికీ మరణం లేని ఓ విప్లవవీరుడు అల్లూరి అని ప్రశంసించారు. అల్లూరి సీతారామరాజు ఘనతను గుండెల్లో పెట్టుకున్నాం కాబట్టే... ఆయన నడయాడిన నేల, నేలకొరిగిన ప్రదేశం ఉన్న గడ్డకు జిల్లాల పునర్విభజనలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అని నామకరణం చేశామన్నారు. దేశం కోసం, అడవి బిడ్డల కోసం తనను తానే త్యాగం చేసుకున్న ఆ మహావీరుడికి నివాళు లర్పిస్తున్నానన్నారు.

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు తెలుగు పౌరుషానికి ప్రతీకన్నారు. అల్లూరి సీతారామరాజు చేసింది ఉద్యమం కాదని, స్వాతంత్ర్య పోరాటమని, అల్లూరి గొప్ప పోరాట యోధుడన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముందుగానే చెప్పి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసిన గొప్ప ధైర్యశాలి అల్లూరి అని కిషన్‌రెడ్డి కొనియాడారు. సినీనటుడు చిరంజీవి మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాలు జరుపుకోవడం జిల్లా ప్రజలకు సంతోషదాయకమన్నారు. అల్లూరి సీతారామరాజు దేశభక్తి, స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చూపిన పోరాటపటిమ, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన తీరు దేశ ప్రజలందరికీ తెలుస్తుందన్నారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి ఆర్‌కే రోజా, రోడ్లు, భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజిత్ భార్గవ్, ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజు, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జేవీ మురళి, ఆర్డీఓలు దాసి రాజు, మల్లిబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, అల్లూరి 125 జయంతి ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పి.నాగరాజు, కార్యదర్శి ఎన్.నానిరాజు ప్రభృతులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి ప్రసంగాన్ని కేంద్ర మాజీమంత్రి దగ్గుబాటి పురందేశ్వరి తెలుగులో అనువాదం చేశారు.

హైలైట్స్ :

- మోదీ పర్యటన సందర్భంగా వామపక్ష నాయకులను గృహనిర్బంధం చేశారు. సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా సమితి సభ్యులు చెల్లుబోయిన రంగారావు, తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావులను గృహ నిర్బంధం చేశారు.
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చన్నాయుడుని హెలిపాడ్ వద్దకు వెళ్లటానికి పోలీసులు నిరాకరించారు. కిషన్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని కలెక్టర్‌తో మాట్లాడగా రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాలో అచ్చన్నాయుడు పేరు లేదని తెలిపారు. దీంతో కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీజీ జాబితాలో అచ్చన్నాయుడు పేరు ఉన్నా కలెక్టర్ అంగీకరించకపోవడం చర్చనీయాంశమైంది.
- భీమవరం, కాళ్ల, ఉండి, ఆకివీడు మండలాల్లో పోలీస్‌శాఖ కఠిన ఆంక్షలు విధించింది. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.
- ఉండి శాసనసభ్యుడు మంతెన రామరాజు (టీడీపీ) సభలో పాల్గొనటం ఆశ్చర్యకరం.
- ప్రధాని ప్రసంగం ఆసాంతం సభా వేదిక వద్దకు బస్సులలో ప్రజలు వస్తూనే ఉన్నారు. వేదిక ఖాళీగా లేకపోవడంతో బస్సు దిగకుండానే వెనుకకు మరలడం విశేషం.

స్టార్టప్ కంపెనీలకు ఆ రాష్ట్రాలు అనుకూలం

న్యూఢిల్లీ: పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) ఏర్పాటు చేయడం ద్వారా స్టార్టప్ కంపెనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న రాష్ట్రాల్లో గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తెలిపింది. ఈ విషయంపై దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరుపై ఆ సంస్థ చేసిన స్టార్టప్ ర్యాంకింగ్స్-2021ను కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం విడుదల చేశారు. స్టార్టప్ కంపెనీలకు అత్యుత్తమమైన ఏకోసిస్టమ్ అందించడంలో గుజరాత్ ప్రథమ స్థానంలో నిలువగా తరువాతి స్థానం కర్ణాటక దక్కించుకున్నట్టు డీపీఐఐటీ తెలిపింది. తరువాతి స్థానాల్లో కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, పంజాబ్, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, గోవా, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చండీగఢ్, పుదుచ్చేరి, నాగాలాండ్‌లు నిలిచినట్టు తెలిపింది. ఇదిలా ఉండగా కోటి మంది జనాభాకన్నా తక్కువ ఉన్న రాష్ట్రాల్లో మేఘాలయ తొలిస్థానంలో ఉన్నట్టు పేర్కొంది.

'ప్రైవేట్'లో ఫీజుల వాత!

(మొదటిపేజీ తరువాయి)

కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రతి పాఠశాలకు, ప్రతి తరగతికి ఫీజుల వ్యత్యాసం భారీగా ఉండడంతో ఫీజుల బరువు మోయలేకపోతున్నామంటున్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేద, మధ్య తరగతికి చెందిన తమపై ఫీజుల భారం మోపిందని ఆరోపించారు.

జులై 5న పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. కొద్ది గంటల్లో బడిగంట మోగనుండడంతో గుండెల్లో దడ పుట్టుకొస్తుందంటున్నారు. స్కూల్ స్కూల్‌కు ఫీజుల్లో భారీ వ్యత్యాసం ఉండడంతో తమ బిడ్డల భవిష్యత్‌పై బెంగపెట్టుకుంటున్నారు. విద్యే భవిష్యత్‌కు పునాది, బంగారుబాటకు సోపానం అంటూ ఊకదంపుడు ప్రకటనలకే ప్రభుత్వం పరిమితమైందని, ప్రైవేట్ యాజమాన్యాలు మాత్రం ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని విమర్శిస్తున్నారు. కరోనా సెకండ్ వేవ్, థర్డ్ వేవ్ అంటూ భయపెట్టడంతో తమ చిన్నారులను సక్రమంగా బడికి పంపలేకపోయామని, ఇదే అదనుగా హాజరు శాతాన్ని సాకుగా చూపి అమ్మఒడి అందకుండా చేశారని ఆవేదన వెళ్లగక్కారు. ఒక్క అవకాశం ఇవ్వండి మీ తలరాతలు మార్చేస్తానంటే ఓట్లు వేసి గెలిపించామనీ, తీరా చూస్తే గత ప్రభుత్వాలే మెరుగనిపిస్తున్నాయని, అసలు ఎందుకు గెలిపించామా అనిపిస్తుంటుందని చాలా మంది తమ మనోభావాన్ని వ్యక్తపరిచారు. కొన్ని పాఠశాలల్లో ఫీజు వెసులుబాటు ఇచ్చినా మరికొన్ని ఒక్కసారే చెల్లించాలని మెడపై కత్తి పెట్టడంతో అప్పోసొప్పో చేసి చిన్నారుల భవిష్యత్ కోసం చెల్లించేస్తున్నామంటున్నారు. ఫీజులకు తోడు పుస్తకాలు, డ్రెస్‌లు, బ్యాగ్‌లు, షూలు, విద్యాసంబంధిత వస్తువుల ధరలు ఆకాశాన్నంటా యని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలంటూ ఓ చేత్తో ఇస్తూనే మరోచేత్తో రెండింతలు లాగేస్తున్నారని అంటున్నారు. పిల్లలే బంగారు భవిత అంటున్న ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు పరిచి పుస్తకాలు అందుబాటులోకి తెస్తే కొంతమేర వెసులుబాటు కలుగుతుందని, ఆ మేరకు పాలకులు దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

ఫీజుల ఖరారు ఇలా..

నర్సరీ నుంచి 10 తరగతి వరకు, జూనియర్ కళాశాలల ఫీజులను ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ (ఏపీఎస్ఈఆర్ఎంసీ) ఖరారు చేసింది. పంచాయతీ పరిధిలో ప్రైమరీ విద్యకు రూ.10 వేలు, హైస్కూల్‌కు రూ.12 వేలు, మున్సిపాలిటీలలో ప్రైమరీకి రూ.11 వేలు, హైస్కూల్‌కు రూ.15 వేలు, కార్పొరేషన్ పరిధిలో ప్రైమరీకి రూ.12 వేలు, హైస్కూల్ విద్యకు రూ.18 వేలు నిర్ధారించింది. జూనియర్ కళాశాలల విషయానికొస్తే రెండు సంవత్సరాలకుగాను పంచాయతీ పరిధిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు రూ.15 వేలు, ఇతర గ్రూపులకు రూ.12 వేలు.. మున్సిపాల్టీల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు రూ.17,500, ఇతర గ్రూపులకు రూ.15 వేలు, కార్పొరేషన్ పరిధిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు రూ.20 వేలు, ఇతర గ్రూపులకు రూ.18 వేలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం జీవో 53, 54 జారీ చేసింది.

ఫీజుల నియంత్రణపై దృష్టిపెట్టాలి

మేం పెద్దగా చదువుకో లేదు.పిల్లల భవిష్యత్ బాగుండాలని ఇంటికి దగ్గరలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఇద్దరు పిల్లల్ని చేర్చాం. కష్టమంతా ఫీజులు, పుస్తకాలు, బట్టలకే సరిపోతుంది. ఈ ఏడాది 8, 9 తరగతుల్లో ప్రవేశించారు. గత విద్యాసంవ త్సరమే ఫీజులు పెరుగుతాయని చెప్పారు. కట్టలేకపోతే వేరే స్కూల్‌లో జాయిన్ చేసుకోమని కరాఖండిగా చెప్పారు. ఎంత పెంచుతారోనని భయంగా ఉంది. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

- కె.శిరీష, విజయవాడ

స్టేతో ఏం చేయలేకపోతున్నాం

ఏపీఎస్ఈఆర్ఎంసీ ఫీజులు ఖరారు చేయగా ప్రభుత్వం జీవో 53, 54 ఇచ్చింది. దీనిపై ప్రైవేట్ యాజమాన్యాలు కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నాయి. దీంతో మేం ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి పాఠశాల కమిటీలో తల్లిదండ్రులను భాగస్వాములను చేసి ఫీజులు నిర్ణయిస్తారు. సహజంగా వారికి అనుకూలమైన వాళ్లనే నియమిస్తారు. అది పారదర్శకంగా ఉండాలి. ఫీజులు ఎంత నిర్ణయించిందీ నోటీస్ బోర్డులో ఉంచాలి. అది ఎక్కడా అమలు జరగడం లేదు. తాము అత్యున్నత సౌకర్యాలు కల్పిస్తున్నాం..జీవోలో పేర్కొన్న ఫీజులకు పాఠశాలలు నడపలేం అన్న అంశంపై యాజమాన్యాలు కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నాయి.

- సీవీ రేణుక, డీఈవో-విజయవాడ

ఇష్టానుసారం పెంచేస్తున్నారు

మాలాంటి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివించాలంటే కష్టంగా ఉంది. ఎల్‌కేజీకే రూ.20 వేలు వసూలు చేశారు. దీనికి తోడు బిల్డింగ్ ఫీజు, విరాళం అంటూ ముక్కుపిండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇష్టానుసారం ఫీజులు పెంచేస్తున్నారు. ప్రతి పాఠశాలకు, ప్రతి తరగతికి ఫీజుల్లో వ్యత్యాసం ఎన్నో రెట్లు ఉంటుంది. ఇంజినీరింగ్ కాలేజీలకు ఖరారు చేసినట్టుగా ప్రభుత్వమే ప్రతి తరగతికి ఫీజు నిర్ధారించి..నియంత్రణ చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేయాలి. ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు జరపాలి. మెరిట్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించాలి.

- సీహెచ్ తులసి, విజయవాడ

ఓట్ల కోసమే బీజేపీ అల్లూరి జపం

విశాలాంధ్ర-విజయవాడ: బీజేపీ ఓట్ల కోసమే మన్యం వీరుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జపం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా వామపక్షాల అధ్వర్యాన సోమవారం విజయవాడలోని బుడమేరు వంతెన వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు అలుపెరగని పోరాటం సాగించారని, బ్రిటీష్ వారిని గడ గడలాడించారని కొనియాడారు. అటువంటి పోరాట యోధుడిని బీజేపీ తన ఓటు బ్యాంకు రాజకీయం కోసం ఒక కులానికి పరిమితం చేయడం సిగ్గుచేటన్నారు. అటవీ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు గిరిజనులను అడవి నుంచి తరిమివేస్తూ, వారి హక్కులను కాలరాస్తున్న బీజేపీకి అల్లూరి పేరు చెప్పే అర్హత లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజుల ఓట్ల కోసం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైసీపీ నుంచి గెలుపొంది రెబల్‌గా మారిన ఎంపీ రఘురామకృష్ణరాజు కోసం భీమవరం వెళ్లారని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి గిరిజనులకు, ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయాలనే ఆలోచన లేదన్నారు. ప్రధానమంత్రికి చిత్తశుద్ధి ఉంటే విశాఖ ఉక్కుకర్మాగారం ప్రైవేటీకరణను నిలిపి వేస్తామని, ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, రాజధానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు సహకరిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రికి తపన ఉంటే అల్లూరి స్ఫూర్తితో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ప్రధానమంత్రిని ప్రశ్నించాలన్నారు. దేశాన్ని, గిరిజనుల హక్కులు కాపాడుకునేందుకు అన్ని వామపక్షాలు, ప్రజాసంఘాలను కలుపుకొని సమరశీల పోరాటాలు సాగిస్తామని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పూలమాల వేసే హక్కు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులకు లేదన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు అనుకూలంగా వ్యవహరించారని, ఇప్పుడు కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశాన్ని తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, సీపీఐ విజయవాడ నగర కార్యవర్గ సభ్యుడు కేవీ భాస్కర్‌రావు, నాయకులు ఎం.రవికుమార్, ఎస్‌కే సుభానీ, కె.రామరాజు, ఎల్.శివకుమార్, లక్ష్మయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పోలారి, మునిశంకర్, రవిచంద్ర, పద్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న రామకృష్ణ, బాబూరావు, పోలారి, ముని శంకర్ తదితరులు

నేడు ఆదోనికి జగన్

విద్యాకానుక కిట్లు పంపిణీ చేయనున్న సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మంగళవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థుల కోసం జగనన్న విద్యాకానుక కిట్లను మూడో ఏడాది అందించేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమైంది. జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కోసం సీఎం జగన్ కర్నూలు జిల్లా ఆదోని వెళ్లనున్నారు. జగనన్న విద్యాకానుక కింద విద్యార్థుల చదువులకు అవసరమయ్యే వస్తువులను కిట్ల రూపంలో ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. పాఠశాలలు తెరచే నాటికి జగనన్న విద్యాకానుక కింద ప్రతి విద్యార్థికి ఉచితంగా మూడు జతల ఏకరూప దుస్తుల క్లాత్‌ను కుట్టుకూలితో సహా అందజేస్తుది. వీటికితోడు జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, పాఠశాల సంచి, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలతో పాటు అదనంగా ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు, తెలుగు డిక్షనరీని ప్రభుత్వం అందజేస్తుంది. బోధనా కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా ఈనెల ఐదు నుంచి నెలాఖరు వరకు విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందచేస్తారు. రూ.931.02 కోట్ల ఖర్చుతో విద్యాకానుక కిట్లను సీఎం జగన్ కర్నూలు జిల్లా ఆదోనిలో పంపిణీ చేస్తారు. ప్రతి విద్యార్థికీ దాదాపు రూ.2వేల విలువైన కిట్లు అందజేస్తారు.

అమరావతి రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర-తుళ్లూరు: అమరావతి రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల ప్లాట్లలో మౌలిక వసతులు కల్పించి వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ చెప్పారు. జోన్-4 అభివృద్ధి పనుల కల్పనలో భాగంగా సోమవారం పిచ్చుకలపాలెం, తుళ్లూరు, అనంతవరం లోని భూసమీకరణ (ఎల్పీఎస్) లోని లే అవుట్లలో కమిషనర్ భూమిపూజ చేశారు. పిచ్చుకల పాలెం వద్ద భూమిపూజ చేసిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. సంబంధించిన లే అవుట్లలో రహదారులు, తాగునీరు, రోడ్లు, విద్యుత్, మురుగునీటి పారుదల లాంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, వీటి నిర్మాణ బాధ్యతలను బెంగుళూరుకు చెందిన బీఎస్ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించినట్లు తెలిపారు. రూ.192.52 కోట్ల వ్యయంతో 63.43 కిలోమీటర్ల మేర అంతర్గత రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. జోన్-4 లో 1358.42 ఎకరాలలో 4,551 ప్లాట్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. రాజధాని లోని మొత్తం 12జోన్ లలో అభివృద్ధి పనులు జరుగుతాయని చెప్పారు. కృష్ణానది కరకట్ట రహదారిని రూ.150 కోట్లతో అభివృద్ధి చేసి విశాల రహదారిగా తీర్చి దిద్దుతున్నట్లు వివేక్ యాదవ్ చెప్పారు. రాజధానిలో అభివృద్ధి పనులకు కావల్సిన నిధులు సమకూర్చు కునేందుకు అమరావతి టౌన్ షిప్ తరహాలో అమరావతిలోనూ టౌన్ షిప్‌ను అభివృద్ధి చేసి ఈ-వేలం ద్వారా ప్లాట్ల అమ్మకాలు చేపడతామని వెల్లడించారు. రైతులకు కౌలు, భూమిలేని నిరుపేదలకు జీవన భృతి చెల్లింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విచారణ పరిధిలో లేని అసైన్డ్ భూములకు కౌలు చెల్లిస్తామన్నారు. పనులు లేక, కౌలు రాక ఇబ్బందులు పడుతున్నామని చెబుతూ అసైన్డ్ రైతు పులి చిన్నా అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలు సత్వరమే చెల్లించాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ షేక్ అలీం, చీఫ్ ఇంజినీర్లు టి.ఆంజనేయులు, సీ హెచ్ ధనుంజయ్, జాయింట్ డైరెక్టర్ టి.చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సాయిబాబు పాల్గొన్నారు.

జగన్ పంతం నెగ్గింది!

- అల్లూరి కార్యక్రమానికి ప్రత్యర్థులను అడ్డుకోవడంలో విజయవంతం
- ఆహ్వానాల్లోనే చంద్రబాబు, పవన్‌కి పరోక్ష సంకేతాలు
- హాజరవ్వాలని విశ్వప్రయత్నం చేసి వెనుతిరిగిన ఎంపీ రఘురామ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాలను పురస్కరిం చుకుని సోమవారం ప్రధాని మోదీ హాజరైన భీమవరం కార్యక్రమానికి ప్రత్యర్థులు హాజరుకాకుండా అడ్డుకోవడంలో సీఎం జగన్ తన పంతం నెరవేర్చుకున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నాలన్నీ ఫలించాయి. దీంతోపాటు కాపు సామాజికవర్గం బలంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే తనతో సత్సంబంధాలు నడుపుతున్న సినీనటుడు చిరంజీవిని మాత్రమే హాజరయ్యేలా చేయడంలో కూడా సీఎం జగన్ విజయవంతమయ్యారు. విపక్ష నేతల్ని ఆహ్వానించిన తీరు గమనిస్తే సీఎం జగన్ సూచనల మేరకే పార్టీ అధ్యక్షులను ఆహ్వానించకుండా, వారి పార్టీల నుంచి ప్రతినిధుల్ని మాత్రమే బీజేపీ ఆహ్వానించినట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా తన సొంత నియోజకవర్గంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక కార్యక్ర మానికి హాజరయ్యేందుకు స్థానిక ఎంపీ రఘురామ కృష్ణంరాజు విశ్వ ప్రయత్నం చేశారు. చివరకు హైకోర్టును కూడా ఆశ్రయించారు. కాని ఆయన చేసిన ఏ ప్రయత్నమూ నెరవేరలేదు. రైలులో ప్రత్యేక బోగీ బుక్ చేసుకుని భీమవరం బయలుదేరిన రఘురామరాజు, చివరకు మధ్యలోనే వెనుతిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే టీడీపీ అధినేత, ఏపీ విపక్ష నేత అయిన చంద్రబాబును ఈ కార్యక్రమానికి ఆహ్వానించడంలోనే చిన్న మెలిక పెట్టారు. ఆయనకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పంపిన లేఖలో టీడీపీ నుంచి ఓ ప్రజా ప్రతినిధిని పంపమని మాత్రమే కోరారు. అంతే కాదు ఈ విషయాన్ని తప్పుగా అర్థం చేసుకుంటారని భావించారో ఏమో కాని, లేఖ రాసిన తర్వాత స్వయంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మళ్లీ చంద్రబాబుకు ఫోన్ చేసి మీ పార్టీ నుంచి ప్రతినిధిని పంపాలని కోరారు. దీంతో చంద్రబాబుకి పరిస్థితి అర్థమై, టీడీపీ తరపున రాష్ట పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని భీమవరం పంపాలని నిర్ణయించారు. కాని ప్రొటోకాల్‌లో ఆయన పేరు కూడా తొలగించడంతో అచ్చెన్నాయుడు వెళ్లలేక పోయారు. ముఖ్యమంత్రి కావాలనే ఇలా చేశారని అచ్చెన్నా యుడు ఆరోపించారు. ఇక బీజేపీ మిత్రపక్షం జనసేన అధినేతగా ఉన్న పవన్ కల్యాణ్‌ను సైతం ప్రధాని మోదీ టూర్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించకపోవడం గమనార్హం. చంద్రబాబు తరహాలోనే పవన్ కల్యాణ్ ను కూడా తమ పార్టీ నుంచి ప్రతినిధిని పంపాలని మాత్రమే కోరినట్లు తెల్సింది. దీంతో పవన్ కల్యాణ్ కూడా మోదీ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఇలా సీఎం జగన్ తన ప్రత్యర్థులుగా భావిస్తున్న ముగ్గురు నేతలను ప్రధాని పర్యటనకు రాకుండా చేయడంలో విజయవంతమయ్యారు.

అల్లూరి ఉత్సవాలు తెలుగుజాతికి గర్వకారణం

టీడీపీ అధినేత చంద్రబాబు నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అల్లూరి సీతారామ రాజు 125వ జయంతి దేశవ్యాప్తంగా జరుపుకోవడం తెలుగు జాతికి గర్వకారణమని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు హైదరాబాద్‌లోని తన నివాసగృహంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అల్లూరి జీవితమంతా పోరాటంతోనే గడిచిపోయింది. బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడి వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులను సమీకరించి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడేలా వారిలో చైతన్యం తెచ్చారు. ఎక్కడికక్కడ పోలీసు స్టేషన్‌లను ముట్టడించి, ఆయుధాలను స్వాధీనం చేసుకుంటూ సాయుధ పోరాటంతో ముందుకు సాగారు. ఆ కాలంలోనే అల్లూరి సీతారామరాజును బంధించి చంపడానికి 40 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. 27 సంవత్సరాల వయసులోనే బ్రిటీష్ వారు ఆయనను చంపేశారు. ఆయన చేసిన పోరాటం శాశ్వతం. అయితే జాతీయ స్థాయిలో ఆయనకు అనుకున్నంత గుర్తింపు రాలేదు. ఈ నేపధ్యంలో కేంద్రం 125వ జయంతి ఉత్సవాలు నిర్వహించదలచడం గర్వకారణం. పార్లమెంటు లో కూడా అల్లూరి సీతారామరాజు విగ్రహం పెట్టాలని గతంలో స్పీకర్ నిర్ణయించారు, నాయకుల పోరాట పటిమ, త్యాగాల వల్ల స్వేచ్ఛా భారత దేశంలో ఉన్నాం. అల్లూరి సీతారామరాజును మనస్మరణకు తెచ్చుకొని తెలుగు ప్రజలంతా ఆయనకు నివాళులర్పించాలని చంద్ర బాబు కోరారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, గురజాల మాల్యాద్రి, బొద్దు లూరు వెంకటేశ్వరరావు, దారపనేని నరేంద్రబాబు, టీఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, చప్పిడి రాజశేఖర్, హసన్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి: వాసిరెడ్డి పద్మ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని లేఖలో మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ కోరారు. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులకు రాష్ట్ర మహిళా కమిషన్ సోమవారం లేఖ రాశారు. నందిగామ డీఎస్పీ, చిల్లకల్లు ఎస్ఐతో ఆమె మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య, ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో జాస్తి శ్వేతాచౌదరి ఆత్మహత్య కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర దర్యాప్తుతో నివేదిక ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి: రామాంజనేయులు

విశాలాంధ్ర-నంద్యాల: చేతివృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పిలుపు నిచ్చారు. సోమవారం చేతివృత్తిదారుల సమాఖ్య నంద్యాల జిల్లా సమితి విస్తృత సమావేశం నంద్యాల నిశాంత్ భవన్‌లో సమాఖ్య జిల్లా నాయకులు డి.సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా చేతివృత్తి దారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ మూడేళ్ల వైసీపీ పాలనలో ఒరిగిందేమీ లేదన్నారు. 56కుపైగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లలో ఒక్క పైసా కేటాయించకపోవడం దారుణమన్నారు. నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న పథకాలను కోత విధించారన్నారు. చేతి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమాలే శరణ్యమన్నారు. చేతి వృత్తుల కార్పొరేషన్లకు తక్షణమే నిధులు కేటాయించి, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేతివృత్తిదారుల సమాఖ్య అధ్వర్యంలో ఈనెల5న రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ భవన్ ఎదుట జరిగే 'ధర్నా' చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, కర్నూలు జిల్లా కార్యదర్శి ఎం.కారన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రామ్మోహన్‌తో పాటు జిల్లాలోని నాయీ బ్రాహ్మణ, రజక, వడ్డెర, దర్జీ, మేదర వృత్తిదారులు పాల్గొన్నారు. అనంతరం చేతి వృత్తి దారుల సమాఖ్య నంద్యాల జిల్లా 13మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డీ సుబ్బయ్య, కార్యదర్శిగా ఎం.రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా శివ నాగయ్య, సహాయ కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా దీనావలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉక్కును విక్రయిస్తే ఊరుకోం

నినాదాలు చేస్తూ హైవే ఎక్కిన కార్మిక వర్గం
జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

విశాలాంధ్ర- కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విక్రయిస్తే ఊరుకునేది లేదనీ, అల్లూరి స్ఫూర్తితో విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామనే వరకు పోరాటం కొనసాగిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో కూర్మన్న పాలెం కూడలిలో పరి రక్షణ పోరాట కమిటీ నేతలు ఉక్కు శాశ్వత, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వేలాది మంది ఉక్కు ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదాలు చేశారు. 'విశాఖ ఉక్కును అమ్మితే ఊరుకోం, ఎవడురా అమ్మేది, ఎవడురా కొనేది' అనే నినాదాలతో కూర్మన్న పాలెం కూడలి మార్మోగింది. ఉదయం 8 గంటలకే ఉక్కు దీక్షా శిబిరం వద్దకు వందలాది మంది ఉద్యోగులు చేరుకున్నారు. ఉద్యోగుల నిరసనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. కూర్మన్నపాలెం కూడలి నుంచి పాత గాజువాక కూడలి వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. పోరాట కమిటీ చైర్మన్లు డీ ఆది నారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహ విష్కరణకు ప్రధాని వస్తున్న సందర్భంగా కూర్మన్నపాలెం కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను విక్రయిస్తున్న నరేంద్ర మోదీకి అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని తాకే నైతిక హక్కు లేదన్నారు. మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటా మన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో పోరాట కమిటీ ప్రతినిధులు కె.ఎస్.ఎన్ రావు, జె.రామకృష్ణ, గంధం వెంకట్రావు, నీరు కొండ రామచంద్రరావు, వైటీదాస్, వై.మస్తానప్ప, విల్లా రామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, బొడ్డు పైడి రాజు, బి.డేవిడ్, డి.సురేష్ బాబు, మహాలక్ష్మి నాయుడు, రమేష్ కుమార్, గణపతి రెడ్డి, జగదీశ్, డి.సంపూర్ణం, కె రాజబాబు, గుమ్మడి నరేంద్ర, జి.బోసు బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఐడీ కళంకిత అధికారులపై చర్యలు

మానవ హక్కుల కమిషన్‌కు టీడీపీ వర్ల రామయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీఐడీ కళంకిత అధికారులపై చర్యలు తీసుకో వాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సోమవారం లేఖ రాశారు. అధికార పార్టీకి అనుకూలంగా ఏపీ సీఐడీ ఇటీవలి కాలంలో అర్ధరాత్రి అరెస్టులు చేస్తూ అపఖ్యాతి పాలౌతున్నది. సీఐడీ చర్యలు భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, మానవ హక్కులకు తీవ్ర ప్రమాదకరంగా తయారయ్యాయి. 2022 జూన్ 29న గార్లపాటి వెంకటేశ్వరరావును అక్రమ అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురిచేసిన ఘటన సీఐడీ వికృత తీరుకు నిదర్శనం. సీఐడీ పోలీసులు దొంగల మాదిరి గోడ దూకడమే కాకుండా తలుపులు పగులగొట్టారు. లైట్లు ఆర్పివేసి వెంకటేశ్వరావు తల్లి, సోదరితో అనుచితంగా ప్రవర్తించారు. 41-ఏ నోటీసు ఇచ్చేందుకు గోడ దూకి తలుపులు పగలగొట్టాల్సిన అవసరం ఏమిటి? అలాగే 30 జూన్ 2022 న ఉదయం మోకరాల సాంబశివరావును మంగళగిరిలో బలవంతంగా అరెస్టు చేశారు. ఆ సమయంలో సాంబశివరావు భార్య బిడ్డకు పాలు ఇస్తున్నా బెడ్‌రూమ్‌లోకి బలవంతంగా వెళ్లారు. వెంకటేశ్వరరావు, సాంబశివరావులను వేర్వేరు గదుల్లో ఉంచి చిత్రహింసలకు గురిచేశారు. వెంకటేశ్వరరావును కొట్టడంతో తీవ్ర గాయాలై అంతర్గత అవయవాలు దెబ్బతిన్నాయి. సీఐడీ సిబ్బంది బాధితుల దుస్తులు తొల గించి నగ్నంగా మార్చి చిత్రహింసలు పెట్టడం విస్మయం కలిగిస్తోంది. వైసీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ తన పదవికి రాజీనామా చేసినట్లు ఫోర్జరీ లేఖను తయారు చేశారనే సాకుతో సీఐడీ అధికారులు ఇదంతా చేశారు. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి. అధికార వైసీపీ నేతలకు ఒక రకంగా, మిగిలిన ప్రజలకు మరో రకంగా భారత రాజ్యాంగం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఐడీ దుశ్చర్యలపై సమగ్ర విచారణ జరిపించాలని, కళంకిత అధికారులు సస్పెన్షన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని వర్ల రామయ్య కోరారు.

ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ(ఏపీ ఈఏపీసెట్)/ఎంసెట్-2022 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభ మయ్యాయి. ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు 4 నుంచి 8వరకు రోజూ రెండు విడతలుగా జరుగుతాయి. రెండో విడతగా అగ్రి, ఫార్మా విభాగం పరీక్షలను ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తారు. ఇంజినీరింగ్ విభాగం పరీక్షల ప్రారంభంతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈసారి ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కుల వెయిటేజీని ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో ఈ పరీక్షకు అత్యంత ప్రాధాన్యత నెలకొంది. ఇందులో వచ్చిన ర్యాంకులు/మార్కుల ఆధారంగానే ఇంజినీరింగ్ సీట్లను కేటాయిస్తారు. ఇప్పటికే జేఈఈ (మెయిన్స్) రాసిన విద్యార్థులు సైతం ఈ పరీక్షకు పోటీపడుతున్నారు. ఏపీ ఈఏపీసెట్‌కు దాదాపు 3లక్షల మందికిపైగా దరఖాస్తు చేశారు. ఒక్క నిముషం ఆలస్యమైన ప్రవేశ నిషేధం నిబంధనతో, ఉదయం విడత పరీక్ష ఉన్న దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షా కేంద్రంలోని సమీప ప్రాంతానికి ముందస్తుగా చేరుకుని బస చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 1,91,370 మంది, 78,381మంది అగ్రి, ఫార్మా విభాగంలో అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. గతంతో పోలిస్తే, ఈ విడత దరఖాస్తులు అధికంగా వచ్చాయి.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీ రామచంద్రయ్య

విశాలాంధ్ర- పత్తికొండ: వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి అధ్యక్షతన స్థానిక చదువుల రామయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో పాల్గొన్న పి.రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 10 లక్షల హెక్టార్ల సాగు భూమి వ్యవసాయేతర రంగాలకు కేటాయించబడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండు చేశారు. రైతు సంఘాన్ని బలోపేతం చేస్తూ ఉద్యమాలను ఉధృతం చేయాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.జగన్నాథం మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో అధిక వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంటల బీమా పథకం అమలులో వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హత ఉన్న రైతులకు బీమా పరిహారం అందలేదని పంట నష్టపోయిన ప్రతి రైతుకు బీమా పరిహారం అందించాలని వారు డిమాండు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 106 చెరువులల్లో తక్షణమే నీరు నింపాలని, హంద్రీనీవా కింద ఉన్న కుడి, ఎడమ కాలువలను పూర్తి చేసి పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

నిరాశపర్చిన మోదీ ప్రసంగం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా భీమవరంలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం రాష్ట్ర ప్రజలను నిరాశపరిచిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం పై మోదీ నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. ప్రజలందరూ ఎదురు చూస్తున్న ప్రత్యేక హోదా, రైల్వే జోన్, రాజధానికి, వెనుకబడిన ప్రాంతాలకు నిధుల కేటాయింపు, విభజన హామీల అమలు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల తదితర అంశాలపై ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడమేనని, రాష్ట్ర అభివృద్ధిపై బీజేపీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరికి ఇది దర్పణమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండో విడత అధికారంలోకి వచ్చాక, పోరాడి సాధించుకున్న గిరిజన చట్టాలను నీరు గారుస్తోందనీ, దానిని కప్పిపుచ్చుకునేందుకు అల్లూరి శతజయంతిని వాడుకోవడం అన్యాయమన్నారు. బీజేపీ మోసపూరిత చర్యలను రాష్ట్ర ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించేవారు గర్హించాలని విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

అన్యాయ మార్గ పాలన

మతాన్ని రాజకీయాలతో మిళితం చేసి ఎన్నికలలో లబ్ధి పొందిన రాజకీయ పార్టీలు ఉండవచ్చు. ఆ పార్టీలు హిందుత్వను అనుసరిస్తూ ఉండవచ్చు. కానీ అభివృద్ధి, హిందుత్వం తన ఎజెండా అని బహిరంగంగా ప్రకటించే సాహసానికి ఒడిగట్టడం మాత్రం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేకే సాధ్యం. ప్రధానమంత్రి మోదీ, ఆయన అనుంగు అనుచరుడు అమిత్ షా కూడా హిందుత్వ విధానాలను అనుసరిస్తున్నా తాము హిందుత్వ మార్గాన్ని అనుసరిస్తున్నామని బహిరంగంగా ప్రకటించిన దాఖలాలు లేవు. కానీ హిందుత్వకు అభివృద్ధి ముసుగు తొడగడంలో మోదీ, అమిత్ షా ద్వయం ఆరితేరిపోయారు. రెండున్న రేళ్లకు పైగా కాంగ్రెస్, శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే తరవాతి స్థానంలో ఉన్న షిందేకు ఇటీవలే హిందుత్వ గుర్తుకు వచ్చింది. ఆయన తిరుగుబాటు చేసిన తరవాతే ఉద్ధవ్ ఠాక్రే కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్‌తో కలిసి కూటమి ఏర్పాటు చేయడం శివసేన స్వభావానికి విరుద్ధమని గుర్తుకు వచ్చింది. సోమవారం శాసన సభలో మెజారిటీ నిరూపించుకునే లాంఛనం పూర్తి అయిన తరవాత షిందేకు హిందుత్వం మీద ఎక్కడ లేని అభిమానం ఒలికి పోయింది. 2019 ఎన్నికల ఫలితాలు వెలువడిన తరవాత శివసేన బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయవలసి ఉందని ఆయన అంటున్నారు. ఏ పరిస్థితిలో ఉద్ధవ్ ఠాక్రే మహా వికాస్ అగాధీ ఏర్పాటుకు సిద్ధమయ్యారో షిందేకు తెలియనిది ఏమీ కాదు. రెండున్నరేళ్ల కాలం ప్రభుత్వంలో ఉన్నందువల్ల సమకూరే వనరులను వినియోగించుకున్న తరవాత, సకల సదుపాయాలను అనుభవించిన తరవాత ఉద్ధవ్ ఠాక్రేకు వ్యతిరేకంగా మెజారిటీ శాసన సభ్యులను కూడగట్టడం సాధ్యమైన నేపథ్యంలోనే ఆయనకు హిందుత్వ ప్రాశస్త్యం గుర్తుకు వచ్చింది. 2019 శాసనసభ ఎన్నికల తరవాత ఉన్న పరిస్థితిని తలుచుకుని షిందే నిండు సభలో కన్నీళ్లు పెట్టుకుని మోదీ నాటకీయ ప్రవర్తనను తలదన్నేలా ప్రవర్తించారు. రెండున్నరేళ్ల పాటు మహా వికాస్ అగాధీలో భాగమైనందువల్ల దావూద్ ఇబ్రహీంతో సంబంధం ఉన్న వారి మీద చర్య తీసుకోలేక పోయానని ఆయన అంటున్నారు. వీర సావర్కర్‌ను కీర్తించడం కూడా సాధ్యం కాలేదట. ఎందుకంటే కాంగ్రెస్‌తో ఉన్నందువల్ల అని షిందే చెప్తున్నారు. మరి ఇప్పుడు బీజేపీ అండతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు కనక దావూద్ ఇబ్రహిం అనుచరుల మీద తక్షణం చర్య తీసుకోవడానికి అడ్డు ఉండకూడదుగా! మరో వేపు నృత్యాలు జరిగే 16 బార్లను తాను స్వయంగా ధ్వంసం చేశానని షిందే గొప్పగా చెప్పుకుంటున్నారు. యువతను పెడదారి పట్టించే అలాంటి బార్లను మూసి వేయించడం సబబే కావచ్చు. కానీ ఆ పని చట్ట రీత్యా జరగాలని గ్రహించకపోవడం మంచి పని కోసమైనా చట్టాన్ని ఉల్లంఘించడం తప్పని షిందేకు తెలియదనుకోవాలా?

హిందుత్వ మీద వీరాభిమానం ముస్లింల మీద ద్వేషాన్ని పెంచి పోషిస్తోంది. ఇది ప్రజల మధ్య చీలికలు తేవడానికే ఉపకరిస్తోంది. సమా జాన్ని నిలువునా చీల్చి అధికారం సంపాదించడానికి లేదా అధికారంలో కొనసాగడానికి చట్టం అంగీకరించదు. మన సంస్కృతీ సమ్మతించదు. భారతీయ తత్వానికి విఘాతం కలగడాన్ని ఆమోదించలేం. విద్వేష ప్రచారంవల్ల ఎన్ని దారుణాలు జరుగుతున్నాయో చూస్తూనే ఉన్నాం. బూటకపు వార్తల గుట్టు విప్పే జుబేర్‌ను అరెస్టు చేయడం, గుజరాత్ మారణ కాండలో ప్రాణాలు కోల్పోయిన వారికి, నిరాధారంగా మిగిలిన వారికి న్యాయం అందేట్టు చూడడానికి రెండు దశాబ్దాల నుంచి పోరాడుతున్న మానవ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌ను అరెస్టు చేయడం దుస్సహమైన విషయం. ఈ అరెస్టు జరగడానికి అనుకూలమైన వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు నడవడిక న్యాయమార్గ పాలనకు గండి కొడ్తోంది. ఏదో అపరాధం చేసినందుకు తీస్తా సెతల్వాడ్ అరెస్టు కాలేదు. బాధితులకు న్యాయం చేయడానికి, కిరాతకంగా హత్యకు గురైన మాజీ ఎంపీ ఎహసాన్ జాఫ్రీ భార్య జకియా జాఫ్రీకి న్యాయం జరగడానికి ప్రయత్నించినందుకు ఆమెను జైల్లో తోశారు. అదీ సుప్రీంకోర్టు ప్రతికూల వ్యాఖ్యల ఆధారంగా. సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో విమర్శనాత్మక వ్యాఖ్యలు చేస్తూనే ఉంటుంది. కానీ ఇంతవరకు ఒక్కసారి కూడా ఆ వ్యాఖ్యల ఆధారంగా ఎవరి మీదా చర్య తీసుకోలేదు. అంటే విద్వేష వాతావరణాన్ని వినియోగించుకోవడంలో న్యాయవ్యవస్థ కూడా భాగస్వామి అవుతోందన్న అనుమానం కలుగుతోంది. ఈ విద్వేష ప్రచారం రాను రాను తార స్థాయికి చేరి వికృత పరిణామాలకు దోహదం చేస్తోంది. మానెసర్‌లో జరిగిన పంచాయత్‌లో ముస్లింలను ఆర్థికంగా వెలేయాలని పిలుపు ఇవ్వడం ఆశ్చర్యకరమే కాదు భయానకం కూడా. బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన దాదాపు 200 మంది ఈ పంచాయత్‌లో పాల్గొన్నారు. ముస్లింలను ఆర్థికంగా వెలేయడానికి గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ వెలివేతను అమలు చేయాలని పరిపాలనా విభాగానికి హెచ్చరిక కూడ జారీ చేశారు. తాము హిందూ సమాజ ప్రతినిధులమని ఈ సమావేశంలో పాల్గొన్నవారు ప్రకటించారు. గుర్గావ్, మానేసర్‌లో అనేక మంది రొహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీలు అక్రమంగా నివాసం ఉంటున్నారని ఈ సమావేశంలో పాల్గొన్నవారు ఆరోపించారు. అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించడానికి పాలనా విభాగానికి వారం రోజుల గడువు ఇచ్చామని ఆ తరవాత మరో పంచాయత్ నిర్వహించి భవిష్యత్ కార్యక్రమం నిర్ణయిస్తామని చెప్తున్నారు. హిందుత్వ వాదుల ఆగడాలవల్ల ముస్లింలు బితుకుబితుకుమని కాలం వెళ్లబుచ్చాల్సి వస్తోంది. పనిగట్టుకుని ముస్లింలను వేటాడుతున్నారు. ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌ను నాలుగేళ్ల కింద సామాజిక మాధ్యమంలో చేసిన వ్యాఖ్య ఆధారంగా అరెస్టు చేయడం ముస్లింలను వేటాడడానికి ప్రబల నిదర్శనం. 1983లో హృషికేశ్ ముఖర్జీ నిర్మించిన సినిమాపై 2018లో జుబేర్ చేసిన వ్యాఖ ఆధారంగా ఇప్పుడు అరెస్టు చేయడం అంతుపట్టని వ్యవహారమే. జుబేర్ చేసిన వ్యాఖ్య అభ్యంతరకరమైందని మాట వరసకు అనుకున్నా ఆ వ్యాఖ్య చేసిన నాలుగేళ్లలోనూ ఆ కారణంగా ఎలాంటి దుర్ఘటన జరగలేదుగా. అలాంటప్పుడు ఇప్పుడే జుబేర్‌ను అరెస్టు చేయడంలో ఆంతర్యం ఆయన ముస్లిం కావడమేనేమో! తీస్తా సెతల్వాడ్ కు వర్తింప చేసిన సూత్రాన్నే ఈ వ్యవహారంలోనూ అమలు చేస్తే జుబేర్‌ను అరెస్టు చేయడంలో నాలుగేళ్ల జాప్యానికి కారకులైన వారి మీద కూడా చర్య తీసుకుంటారా? మహమ్మద్ ప్రవక్తను టీవీ చానళ్లలో బహిరంగంగా అవమానించిన నూపుర్ శర్మ మీద మాత్రం ఎలాంటి చర్యా ఉండదు. చట్టం అయిన వారికి చుట్టం అంటే ఇదే.

అఖండ జ్యోతి స్టాన్ స్వామి

ఆర్వీ రామారావ్

సరిగ్గా ఏడాది. గత సంవత్సరం ఇదే రోజు (05-07-2021) ఫాదర్ స్టాన్ స్వామి నిర్బంధంలో ఉండగానే ప్రాణాలు విడిచారు. 84 ఏళ్ల ఆ వృద్ధుడు పార్కిన్సన్ వ్యాధితో సహా అనేక రుగ్మతలతో తీసుకుంటున్నప్పటికీ పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తామని అవకాశం దొరికినప్పుడల్లా చెప్పే న్యాయవ్యవస్థ స్టాన్ స్వామికి మాత్రం ఆరోగ్య కారణాలతోనైనా బెయిలు మంజూరు చేయలేదు. ఆయన గ్లాసుతో మంచినీళ్లు తాగడం కూడా కష్టంగా ఉండేది. తనకు మంచి నీళ్లు తాగడానికి సిప్పర్ ఇప్పించాలని స్టాన్ స్వామి న్యాయమూర్తులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేశారో!

బీమా కోరేగావ్ కేసులో అక్రమంగా అరెస్టు చేసిన వారిలో స్టాన్ స్వామి కూడా ఒకరు. 2020 అక్టోబర్8న ఆయనను చట్ట వ్యతిరేకంగా అరెస్టు చేశారు. ఆయన ఎన్నిసార్లు బెయిలు కోసం అర్జీలు పెట్టుకున్నా వినిపించుకున్న నాథుడే లేడు. చివరకు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి దయతలచి ఆయనకు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించడానికి అనుమతించారు. అంతకుముందూ నిర్బంధంలో ఉండగానే అనేక రోజులు తలోజా జైలులో మగ్గిపోయారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఎంత మంచి చికిత్స అందినా ఆయన ప్రాణాలు నిలబడలేదు. న్యాయవ్యవస్థ ఆయనకు బెయిలు మంజూరు చేయడానికి దీర్ఘకాలం నిరాకరి చినందువల్ల ఆఖరి నిమిషంలో ప్రైవేటు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కూడా ఆయనను కాపాడలేక పోయింది. ఇది నిజానికి రాజ్యం చేసిన హత్యలో భాగంగానే పరిగణించాలి. నిజానికి ఆయనను అరెస్టు చేయడమే అక్రమం. ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నందువల్ల అస్సలు అరెస్టు చేయవలసింది కాదు.

స్టాన్ స్వామి ఈ లోకం వదిలి వెళ్లినా ఆయన మీద మోపిన ఆరోపణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. బీమా కోరేగావ్ కేసులో అనేకమందిని జైళ్లలో మగ్గబెట్టడం తప్ప ఇంతవరకు విచారణే ప్రారంభం కాలేదు. ఈ దేశంలో, ముఖ్యంగా మోదీ సర్కారు హయాంలో న్యాయస్థానాలు విధించే శిక్ష కన్నా ఏళ్ల తరబడి జైళ్లల్లో మగ్గడమే పెద్ద శిక్ష.

స్టాన్‌స్వామి తన జీవితాన్నంతటినీ గిరిజనులకోసం, హక్కులు, అధికారాలు లేని వారికోసం, అణగారిన వర్గాల కోసం పోరాడుతూనే గడిపారు. ఆయనది నిఖార్సైన నిస్వార్థ సేవ. రాను రాను అమానవీయంగా మారుతున్న సమాజంలో ఆయన దోపిడీకి గురవుతున్న వారి తరఫున, అభివృద్ధి ఫలాలు అందనివారి కోసం తాపత్రయపడ్డారు. గాంధేయ పద్ధతుల్లో ఉద్యమాలు నిర్మించారు. భౌతికంగా స్టాన్‌స్వామి మనమధ్య లేకపోయినా దేశవాసులే కాదు, ప్రపంచవ్యాప్తంగా సత్యాహింసల్లో విశ్వాసం ఉన్నవారు, పీడితజన పక్షాన నిలబడేవారు ఆయనను ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. ఆయనను నిర్బంధించి నప్పుడు, నిర్బంధంలో ఉండగానే మరణించినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. వందలు వేల సంఖ్యలో జనం రోడ్ల మీదకొచ్చి స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం నినదించారు. దయ, ధైర్యం, సహజీవనం, నిబద్ధత ఆయన వ్యక్తిత్వంలోని మూలకందాలు.

బీమా కోరేగావ్ కేసులో ఇద్దరు మాత్రమే బెయిలు మీద తాత్కాలికంగా విడుదలయ్యారు. మిగతా 15మంది ఇంకా జైలులోనే మగ్గుతున్నారు. అభివృద్ధికి నోచుకోని వారు, దోపిడీకి గురయ్యే వారు అంటే స్టాన్ స్వామి హృదయం చలించిపోయేది. జీవిత వాస్తవికతను అర్థం చేసుకున్న కొద్ది మందిలో స్టాన్ స్వామి ఒకరు. పేదల ఆక్రందనలు వింటే ఆయనలో కరుణ, దయ ఉప్పొంగడంతో పాటు పోరాట పటిమ మరింత రాటుదేరేది. పీడితుల పక్షాన నిలబడి అన్యాయాన్ని ఎదిరించాలన్న ఆయన సంకల్ప బలం మరింత ఇనుమడించేది. పేదలు, నిర్వాసితులు, దోపిడీ కాడి కింద నలిగిపోయే వారు, హక్కులకు దూరంగా ఉండే వారితో మమేకం కావడం స్టాన్ స్వామి వ్యక్తిత్వంలోని విశేష లక్షణం. పీడితుల సుఖఃదుఖాలలో ఆయన సదా భాగస్వామిగానే ఉన్నారు. వారు నిరుపేదలుగా మగ్గిపోవడానికి మూలకారణాల మీద తన పోరాట పటిమను ఎక్కుపెట్టడం స్టాన్ స్వామిలోని మరో విశిష్టత.

ఈ పోరాట క్రమంలో ఆయన అనేక సమస్యలు ఎదుర్కున్నారు. ఓపికగా సవాళ్లను అధిగమించడం మీదే దృష్టి నిలిపారు. భయం అంటే ఏమిటో ఆయనకు తెలియదు. అందువల్లే ఆదివాసీల హక్కులు కాపాడడానికి ఆయన స్వార్థపర శక్తులతో నిరంతరం పోరాడుతూనే వచ్చారు. వారికి దక్కవలసిన భూమి, ఇతర సహజ వనరుల కోసం పోరాడడం మాత్రమే కాకుండా గిరిజన సంస్కృతిని పరిరక్షించడానికి ఆయన పడ్డ పాట్లు అపురూపమైనవి. నిష్కారణంగా యువకులు జైళ్లల్లో మగ్గిపోయిన సందర్భాలలోనూ ఆయన పోరాడే వారు. ఇతరులకు న్యాయం కలిగేట్టు చేసే క్రమంలో అనేక సార్లు ఆయన ప్రాణాల మీదకు వచ్చినా ఎన్నడూ లెక్క చేయలేదు.

రాజ్యాంగ పీఠికలో రాసుకున్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆయన దృష్టిలో కేవలం ఆదర్శాలు మాత్రమే కావు. అవి ప్రజల భావనల్లో జీర్ణించుకు పోవలసిన అవసరం ఉందని చెప్పేవారు. ఈ లక్ష్య సాధన కోసం ఎవరు పోరాడినా రాజకీయ విభేదాలను పట్టించుకోకుండా స్టాన్ స్వామి ఆ పోరాటలన్నింటిలో భాగస్వామి అయ్యేవారు.

ప్రస్తుతం దేశం రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో తీసికట్టుగా తయారైంది. ప్రతి రంగంలోనూ కాళ్లీడుస్తోంది. జనజీవనం, ప్రజాస్వామ్య హక్కులు, మీడియా స్వేచ్ఛ లాంటి కీలక రంగాలలో మనదేశం అట్టడుగు స్థాయిలో ఉంది. పైగా మోదీ ఏలుబడిలో ఒక్కో మెట్టూ కిందకు దిగ జారుతోంది. విచ్ఛిన్నకర విధానాలు, వివక్ష, విద్వేషం, ఒక వర్గం వారిని వికృతీకరించి చూపడం, వారిని కించపరచడం అనునిత్యం చూస్తూనే ఉన్నాం. హింస, దౌర్జన్యం, విద్వేష ప్రచారం సర్వత్రా వ్యాపించి విలయ తాండవం చేస్తున్నాయి. ఎటు చూసినా ఈ వికృత సంస్కృతిని ప్రోత్సహించే వారి వికటాట్టహాసమే వినిపిస్తోంది. నిష్పాక్షికంగా ఉండవలసిన ఎన్నికల కమిషన్, సీబీఐ లాంటి వ్యవస్థలు ప్రస్తుతం

కేంద్రంలో అధికారంలో ఉన్న వర్గాలకు తాబేదార్లుగా మారిపోయాయి. ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ లాంటివి ఏలిన వారి పరిచారికలుగా తయారయ్యాయి. ఈ దశలో స్వచ్ఛందంగా ప్రభుత్వానికి దాసోహం అంటున్న మీడియా గురించి ఎంత తక్కువ చెప్తే అంత మంచిది.

స్టాన్ స్వామిని బీమా కోరేగావ్ కేసులో నిర్బంధించడం, నిర్బంధంలో ఉండగానే ఆయన మరణించడం దారుణం అయిన మాట నిజమే. కానీ ప్రభుత్వానికి ఆయన ఒక్కడి మీదే ప్రత్యేకమైన కసి, ద్వేషం, పగ లాంటివి ఏమీ లేవు. న్యాయం, సత్యం కోసం పోరాడే వారెవరైనా మోదీ సర్కారు దృష్టిలో ద్రోహుల కిందే లెక్క. వారిని వేధిస్తారు. జైళ్లల్లో కుక్కుతారు. నోరు మూయిస్తారు. సంబంధం లేకపోయినా, ఏ మాత్రం వర్తించకపోయినా అత్యంత కఠినమైన చట్టాల కింద కేసులు మోపుతారు. స్టాన్ స్వామి ప్రాణ త్యాగం ఇలాంటి వారికి హెచ్చరిక కావాలని ప్రభుత్వం భావిస్తోంది.

మహమ్మద్ జుబేర్, తీస్తా సెతల్వాడ్ లాంటి వారు నిజం చెప్పడానికి ప్రయత్నించినందువల్లే ప్రస్తుతం జైళ్లలో ఉన్నారు. నిరాధారమైన ఆరోపణలు ఎదుర్కుంటున్నారు. మరో వేపు వృత్తి ధర్మాన్ని నిర్వర్తించిన పాపానికి గుజరాత్ పోలీసు ఉన్నతాధికారి సంజీవ్ భట్ దీర్ఘకాలంగా జైలు లోనే ఉన్నారు. మరో పోలీసు అధికారి ఆర్.బి. శ్రీ కుమార్‌ను తీస్తాతో పాటే అరెస్టు చేసి జైలుకు పంపించారు. విద్వేష ప్రచారం చేసే నూపుర్ శర్మలాంటి వారు మాత్రం హాయిగా, స్వేచ్ఛగా తిరుగుతూనే ఉంటారు. ఒక వేళ అరెస్టయినా వారికి స్వల్ప కాలంలో బెయిలు మంజూరు అవుతుంది. అన్యాయాన్ని అక్రమాలను చూస్తూ ఊరుకునే లక్షణం లేని స్టాన్ స్వామి లాంటి వారు ప్రాణాలు అర్పించి మూల్యం చెల్లించుకుంటారు. అలాంటి వారు అపరిమితమైన సంఖ్యలో ఉండవలసిన తరుణంలో కరకు రాజ్యం ఆయనను మింగేసింది. కానీ ఆయన స్ఫూర్తి, పోరాట పటిమ, చిత్తశుద్ధి ప్రేరణ కలిగిస్తూనే ఉంటాయి. ఆయన వెలిగించిన దీపం అఖండంగా వెలుగుతూనే ఉంటుంది.

మరో మూడు రాష్ట్రాలపై కన్ను

శంకర్ రాయ్

మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడి ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత జార్ఖండ్ ప్రభుత్వాన్ని సైతం పడగొట్టేందుకు ఇప్పటికే బీజేపీ కేంద్ర నాయకత్వం కుట్ర పథకాన్ని రూపొందించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆ తర్వాత రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ వరుసలో ఉన్నాయని అంటున్నారు. అంతేకాదు కొంతమంది బీజేపీ ముఖ్య నేతలు కూడా సూచన ప్రాయంగా తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టిన తర్వాత అనేక రాష్ట్రాల్లో ఇతర పార్టీల్లో తిరుగుబాట్లు చిచ్చురేపి తమ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు డబ్బు, పదవులు ఇతర ప్రయోజనాలను కల్పించి ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చివేసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మహారాష్ట్రలో ఇప్పుడు జరిగింది ఇదే. ఇందుకు వందల కోట్లు బీజేపీ ఖర్చు చేస్తున్నదన్న బలమైన ఆరోపణలున్నాయి. ఇప్పటికే జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వాలను పడగొట్టే 'కుట్ర' అమలు బాధ్యతను కొందరికి అప్పగించినట్టుగా తెలుస్తోంది. మహారాష్ట్ర తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికలలోపు రాజస్థాన్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో అమలు చేస్తామని సువేందు అధికారి చెప్పారు. బెంగాల్‌లో ఆయన ప్రముఖ బీజేపీ నాయకుడు. బెంగాల్‌లో గత ఎన్నికల ప్రచారంలో ఈసారి ప్రభుత్వం తమదేనని ఢంకా బజాయించిన హోంమంత్రి అమిత్‌షా ఫలితాలు వచ్చిన తర్వాత మౌనం దాల్చారు. బీజేపీ టిక్కెట్టుపై గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో చేరిపోయారు. మహారాష్ట్రలో తమ పథకం ఫలిస్తోందని, తక్కిన మూడు రాష్ట్రాల్లో వ్యూహాలు వెంటనే అమలు చేస్తామని సువేందు అధికారి అన్నారు. చాలా రాష్ట్రాల్లో వలెనే బెంగాల్ గవర్నరు జగదీప్ ధన్కర్ కూడా ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టడానికి ఏమాత్రం వెనుకాడరు. ప్రతిపక్ష పాలక పార్టీల్లో చీలికలు తీసుకురావడం బీజేపీ ఒక అజెండాగా పెట్టుకున్నది. చీలికలు తీసుకురావడానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని బీజేపీకి దగ్గరగా ఉన్న వర్గాలే చెప్తున్నాయి. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే లాంటి నాయకుడిని ఎంపిక చేసుకొని ఆయన ద్వారా తమ కుట్రను అమలు చేస్తారు. 2019లోనే బీజేపీ మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. బెంగాల్ గవర్నరు జగదీప్ ధన్కర్‌ను కలిసిన తర్వాతనే సువేందు అధికారి ఈ విషయాలని వెల్లడించారు. బీజేపీ యేతర పార్టీలన్నీ ధన్కర్ వ్యవహార శైలిని తీవ్రంగా విమర్శించాయి. తాజాగా మహారాష్ట్రలోనూ బీజేపీ కొత్త వ్యూహం పన్నింది. ఏక్‌నాథ్ షిండేని ముఖ్యమంత్రిని చేసింది. తాను అనుకున్న లక్ష్యం నెరవేరగానే షిండేను ఏ రోజైనా పక్కకు నెట్టే అవకాశాలే ఎక్కువ. షిండే తరహా తిరుగుబాట్లను ప్రోత్సహిస్తారు. తిరుగుబాటు చేసిన ఒక్కొక్క ఎమ్మెల్యేకు వంద కోట్లు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. గత పదిరోజులుగా తిరుగుబాటుదారులను మూడు రాష్ట్రాలకు తరలించడానికి, హోటళ్లకు, ఆహారానికి మరికొన్ని కోట్లు ఖర్చు చేశారు. బీజేపీ వద్ద కావలసినన్ని వనరులున్నాయన్నది అందరికీ తెలుసు.

పశ్చిమ బెంగాల్‌లోనూ షిండే తరహా తిరుగుబాటు అమలు చేసేందుకు ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డాక్టరు సుకాంత మజుందార్ సువేందుకు బాధ్యత అప్పగించారని తెలుస్తోంది. పాలక టిఎంసిలో గల అంతర్గత గొడవలను ఉపయోగించుకొని తిరుగుబాటు ఎత్తుగడ అమలు చేస్తారు. అయితే మజుందార్ అధికారి వలె గాకుండా టిఎంసి ఎమ్మెల్యేల మధ్య గొడవలతో తమకేమీ సంబంధం లేదని నటించటంలో దిట్ట. ఇక రాజస్థాన్ అసెంబ్లీ సభ్యుల సంఖ్య 200 కాగా 108 మంది కాంగ్రెస్, ఇద్దరు సిపిఎం, ఒకరు ఆర్ఎల్‌డి సభ్యులున్నారు. అలాగే బీజేపీ సభ్యులు 71 మంది, 17 మంది ఇండిపెండెంట్లు ఉన్నారు. మరో 30 మందిని కాంగ్రెస్ నుండి చీలిస్తే తేలికగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలమని బీజేపీ పథకం వేసుకున్నది. బీజేపీ దూకుడును చూసిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బీజేపీ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతు తెలిపారు. ముర్ము ఆదివాసీ గనక మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను వదిలేసి గతంలో వలె జెఎంఎం-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలున్నాయన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. జార్ఖండ్‌లో అనేక గనులను సోరెన్ కుటుంబ సభ్యులు లీజుకు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. అందువల్ల సోరెన్ కుటుంబ సభ్యులను సిబిఐ, ఈడీలు ఎప్పుడైనా ప్రశ్నించడానికి పిలిపించవచ్చు. రాష్ట్రపతి పదవికి జరిగే ఎన్నికల్లో ప్రతిపక్షం నుండి సోరెన్ దూరంగా ఉన్నందున బీజేపీ తన వ్యూహం అమలు చేయవచ్చు. బీజేపీ వ్యతిరేక ప్రాంతీయ పార్టీలు పాలిస్తున్న అన్ని రాష్ట్రాల్లో తన కుట్ర వ్యూహాన్ని క్రమంగా అమలు చేసి ఆయా పార్టీలను నిర్వీర్యం చేయడం అజెండాగా పెట్టుకున్నది. వామపక్షేతర ప్రతిపక్ష పార్టీలన్నీ అవినీతి కేసుల్లో ఉన్నాయి. కేంద్ర నిఘా సంస్థల ద్వారా ఈ పార్టీలను దారికి తెచ్చుకోవచ్చునని వ్యూహకర్త అమిత్‌షా భావిస్తున్నారని తెలుస్తోంది. మహారాష్ట్రలో కుట్ర వ్యూహం ఫలితాన్నిచ్చిన ఉత్సాహంలో బీజేపీ కొత్త ఎత్తుగడలకు సిద్ధమవుతోంది.

ఐ-మెయిల్

బొగ్గు రంగంలో కీలక పాత్ర వహిస్తున్న కోల్ ఇండియాను ప్రైవేటీకరించే దిశలో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిని తీవ్రంగా వ్యతిరేకించాలి. దక్షిణ భారతంలో ఏకైక బొగ్గు సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీలోని నాలుగు బొగ్గు బ్లాకులను వేలం పాట ద్వారా కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు కార్మికులు ఇప్పటికే సమ్మెలు చేసారు. కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్)లో తన వాటాను 66 శాతానికి తగ్గించిన ప్రభుత్వం ఇప్పుడు తమ వాటాలను విక్రయించడం ద్వారా దాని అనుబంధ కంపెనీల ప్రైవేటీకరణను ప్రారంభించాలని యోచి స్తోంది. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బిసిసిఎల్), సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్ (సిఎమ్‌పిడిఐఎల్) లో 25 శాతం వాటాను విక్రయిం చాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్, ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్, నార్తర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ వంటి సిఐఎల్ బొగ్గు ఉత్పత్తి అనుబంధ సంస్థల వాటాలను విక్రయించడానికి కూడా ప్రణాళికలు రూపొందించారు. భారతదేశంలో ఉక్కు ఉత్పత్తికి ముఖ్యమైన ముడి సరుకు కోకింగ్ బొగ్గు పరిమిత నిల్వలు ఉన్నాయి. దేశంలో కోకింగ్ బొగ్గు ఉత్పత్తిలో ఎక్కువ భాగం "భారత్ కోకింగ్ కోల్ కంపెనీ లిమిటెడ్" ద్వారా జరుగు తుంది. ప్రస్తుతం దేశానికి అవసరమైన కోకింగ్ బొగ్గులో 50 శాతం ఉంది. మిగిలినది దిగుమతి చేసుకోవాలి. ఇంతటి కీలకమైన కంపెనీని

కోల్ ఇండియాలో ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

ప్రైవేటీకరించడం దేశ ప్రయోజనాలకు మేలు చేయదు. సియంపీడీఐఎల్ (కోల్ మైన్స్ ప్లానింగ్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్) వాటాల విక్రయానికి ముందే, ప్రభుత్వం మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఇసిఎల్)ని దానిలో విలీనం చేసే ప్రణాళికను ప్రకటించింది. సియంపీడీఐఎల్ ప్రైవేటీకరణ ఎంఇసిఎల్ ప్రైవేటీకరణకు సమానం అవుతుంది. ఈ విలీనం సియంపీడీఐఎల్ కార్మికులలో చాలా ఆందోళనలను లేవనెత్తింది, వారు ప్రకటన చేసిన రోజు నుండి ఆందోళన చెందుతున్నారు. సియంపీడీఐఎల్ పని బొగ్గు కార్మికులకు ముఖ్యమైనది, ఎందుకంటే ఇది సురక్షితమైన మైనింగ్‌ను నిర్ధారిస్తుంది. దీని ప్రైవేటీకరణ కార్మికుల భద్రతకు ముప్పు తెస్తుంది. ఎంఇసిఎల్ దేశంలోని వివిధ ఖనిజాలను కనుగొంటోంది. ఇలాంటి కీలక కార్యకలాపాలను ప్రైవేటుకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. బొగ్గు వంటి సహజ వనరులు సమాజం, ప్రజల ఆస్తి. వాటిని ప్రైవేటు లాభాల కోసం అప్పగించడం సామాజిక, ప్రజా వ్యతిరేక చర్య. దేశంలోని బొగ్గు కార్మికులు తమ పరిశ్రమను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. వారికి అండగా అన్ని రంగాల కార్మికులు కూడా వారితో జతకట్టాలి!

ఆళవందార్ వేణు మాధవ్
8686051752

ప్రాంతీయ పార్టీలకు గుణపాఠం

ఎస్.టి.జి.శ్రీధర్

బలమైన ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య మనుగడకు వెన్నెముక అని ఒకపక్క గంభీరమైన ప్రకటనలు చేస్తూ మరో వైపు నుంచి ప్రతిపక్షాలను సమూలంగా భూస్థాపితం చేయడానికి అత్యంత నైపుణ్యంతో పావులు కదుపుతున్న భారతీయ జనతా పార్టీ అధినాయకత్వం తన లక్ష్యసాధనలో మరో అడుగు ముందుకు వేసింది. తాము చేస్తే సంసారం పక్క వాడు చేస్తే వ్యభిచారం అన్న నానుడిని రుజువు చేస్తూ బీజేపీ అధినాయకత్వం చాప కింద నీరు లాగా పావులు కదిపి మరో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. తన చేతికి మట్టి అంటకుండా తనపై ప్రత్యర్థులు దుమ్మెత్తి పోయకుండా చూసుకుంటూ మహారాష్ట్రలోని శివసేన కూటమి ప్రభుత్వాన్ని అత్యంత చాకచక్యంగా కూల్చేసింది. ఇదే ప్రక్రియను కాంగ్రెస్ చేసి ఉంటే ఈపాటికి వీధులకెక్కి పెద్ద ఎత్తున గొడవ చేసి అల్లకల్లోలం సృష్టించి ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ కానీ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలుగా వ్యవహరించవలసిన పత్రికలు గాని నోరు విప్పడానికి సాహసించటం లేదు. 1984, 1994లో ఎన్టీఆర్ ప్రభుత్వం వెన్నుపోట్లకు గురై ఎన్టీఆర్ పదవీచ్యుతులయ్యారు. 1984లో నాదెండ్ల భాస్కరరావు అతి తక్కువ మంది శాసనసభ్యుల మద్దతుతో ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రయ్యారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం నెల రోజులపాటు జరిగిన ఆందోళనలో పత్రికలు, ప్రతిపక్షాలు కీలక పాత్ర వహించాయి. 1994లో ఎన్టీఆర్ సొంత అల్లుడే ఆయనకు వెన్నుపోటు పొడిచినప్పుడు ఇటు పత్రికలు, అటు ప్రతిపక్షాలు 1984లో జరిగిన ఉద్యమాన్ని తిరిగి నిర్వహించడంలో విఫలమయ్యాయి. నేడు మహారాష్ట్రలో చరిత్ర పునరావృతమైంది. 39 మంది శాసన సభ్యుల అండతో ఏక్‌నాథ్ షిండే అనే శివసేన నాయకుడు ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేపై తిరుగుబాటు ప్రకటించి అనూహ్య పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి అయ్యారు. షిండేకు కొండంత అండగా బీజేపీ తెరవెనక నుంచి పూర్తి మద్దతు అందజేసింది. తిరుగుబాటు శాసనసభ్యులను రెండు రాష్ట్రాలు తిప్పి తిరిగి ముంబాయి తీసుకురావడంలో బీజేపీ నాయకులదే ముఖ్య భూమిక. ఇందుకు అయిన ఖర్చు అంతా ఎవరు భరించారో అందరికీ తెలుసు. అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని చెప్పటానికి అనేక రాష్ట్రాలలో ఆ పార్టీ దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన సంఘటనలే సజీవ ఉదాహరణలు. తాము ఏ ప్రభుత్వాన్నీ కూలతోయలేదని, నాయకత్వంతో సరిపడక బయటకు వచ్చిన అసమ్మతి వాదులకు మద్దతు ప్రకటించామని బీజేపీ చెప్పుకొస్తోంది. మహారాష్ట్రలో 2019 ఎన్నికలలో బీజేపీ, శివసేన కలిసే పోటీ చేసాయి కానీ ముఖ్యమంత్రి పదవి విషయంలో వచ్చిన అభిప్రాయ భేదాలు పొత్తు చీలికకు దారితీసాయి. అధిక స్థానాలు సాధించిన శివసేన మరో రెండు పార్టీలను కలుపుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటినుండీ బీజేపీ ఈ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కాచుక్కూర్చుంది. ఠాక్రే ప్రభుత్వం పరస్పర వైరుధ్య కారణాలతో తనకు తానుగా కూలిపోతుందని బీజేపీ నాయకులు అప్పట్లోనే స్పష్టం చేశారు. ఈ అభిప్రాయాన్ని రుజువు చేసే తీరులో ఠాక్రే వ్యవహరించారు. కుమారుడైన ఆదిత్య ఠాక్రేని మంత్రివర్గంలోకి తీసుకుని పెద్ద తప్పిదం చేశారు. ఆదిత్య ఠాక్రే కీలక మంత్రిత్వ శాఖలలో వేలు పెట్టడం ముఖ్యమైన ఫైళ్లను తన పరిశీలనకు పంపవలసినదిగా జారీ చేసిన ఆదేశాలు మంత్రివర్గంలో కలకలం లేపాయి. ముఖ్యంగా తిరుగుబాటు నాయకులు షిండే ఈ మొత్తం వ్యవహారాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. సమయం చూసి షిండే దెబ్బతీశారు. రాజకీయాలలో ఆరితేరిన ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూడా అసమ్మతి కార్యకలాపాలను పసిగట్టలేకపోయారు. తండ్రి బాల్ ఠాక్రేతో పోల్చి చూసుకుంటే ఉద్ధవ్ ఠాక్రే అన్ని విషయాలలో బలహీనుడు. తండ్రి చాటు బిడ్డగా ఎదిగాడే తప్ప సొంతంగా తనదైన రాజకీయ వ్యూహాన్ని, నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోలేక పోయాడు. ఆయన ఆరోగ్యం కూడా అంతంతమాత్రమే. ఆయన కార్యా లయంలో ఇన్నర్ సర్కిల్‌గా ఏర్పడిన ముగ్గురు అధికారులు, కొడుకు ఆదిత్య ప్రభుత్వాన్ని తెరవెనుక నుంచి నడిపించి ముఖ్యమంత్రిని ఉత్సవ విగ్రహంగా నిలబెట్టారు. ముఖ్యమంత్రి కూడా శాసనసభ్యులను కలవటానికి ఇష్టపడేవారు కాదు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం ఏనాడు చేయలేదు. వీటితోపాటు శివసేన హిందుత్వ సిద్ధాంతానికి దూరమైందన్న అభిప్రాయం ఉంది. అధికారాన్ని కాపాడుకోవడానికి ఎన్‌సిపి, కాంగ్రెస్‌లను దూరం చేసుకోవడం ఇష్టం లేక ముఖ్యమంత్రి హిందుత్వ సిద్ధాంతాన్ని నీరు కారుస్తున్నారని తిరుగుబాటు నాయకుడు ఏక్‌నాథ్ షిండే బహిరంగంగా ఆరోపించిన సంగతి విదితమే.

మహారాష్ట్ర మరాఠీ వారికే అన్న భూమిపుత్రుల సిద్ధాంతం, హిందుత్వకు వేసిన పెద్దపీటతో ఆ రాష్ట్రంలో శివసేనను బలమైన శక్తిగా మార్చారు బాల్ ఠాక్రే. దక్షిణ భారతదేశానికి చెందిన అనేకమంది మహారాష్ట్రకు వలస వచ్చి తమ వారికి లభించవలసిన ఉద్యోగాలను తన్నుకు పోతున్నారని బాల్ ఠాక్రే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. 1966లో ఆవిర్భవించిన శివసేన ధాటికి దక్షిణ భారతదేశానికి చెందిన అనేకమంది తిరిగి సొంత రాష్ట్రాలకు వెళ్లి పోయారు. పంచకట్టుతో కనిపించిన ప్రతి ఒక్కరికి శివసేన సైనికులు దేహశుద్ధి చేసేవారు. బాల్ ఠాక్రే ఇచ్చిన పిలుపు అరాచకానికి దారితీసింది. కానీ రాజకీయంగా శివసేన పటిష్టమైన స్థితికి చేరుకోవడానికి దోహద పడింది. శివసేన ధాటికి కాంగ్రెస్ మట్టి కరిచింది. బాల్ ఠాక్రే ఉన్నంతకాలం శివసేనకు అడ్డు లేకుండా పోయింది. 2012వరకు బాల్‌ఠాక్రేకు పార్టీలో ఎదురు లేదు. ఆయన మేనల్లుడు రాజ్ ఠాక్రే మొదటిసారిగా తిరుగుబాటు చేశారు. అంతకుముందు నారాయణ రాణే పార్టీ నుంచి బహిష్కృతులయ్యారు. అప్పటి నుంచి పార్టీలో క్రమశిక్షణా రాహిత్యం మొదలైంది. తండ్రి నుంచి ఉద్ధవ్ ఠాక్రే పార్టీ పగ్గాలను స్వీకరించిన తర్వాత శివసేన ప్రాభవాన్ని కోల్పోవడం మొదలైంది. బీజేపీ మహారాష్ట్రలో బలీయమైన శక్తిగా ఆవిర్భవించింది.

ఉద్ధవ్ ఠాక్రే బలపరీక్షకు ఒకరోజు ముందే పదవికి రాజీనామా చేశారు. అంతకంటే ఘోరంగా శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేసి రాజ కీయంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. బల పరీక్షకు సిద్ధమై విధానసభ వేదికగా ఇటు బీజేపీ నుంచి అటు తన సొంత సభ్యుల నుంచి ఎదురైన వెన్నుపోట్ల పర్వంపై విరుచుకుపడి ఉంటే ప్రజల్లోకి బలమైన సందేశం వెళ్లి ఉండేది. ఉద్ధవ్ ఠాక్రే ఈ అవకాశాన్ని జార విడుచుకున్నారు. శివసేన భవితవ్యం ఇప్పుడు నాలుగు రహదారుల కూడలి మధ్య నిలిచి ఉంది. శివసేన ఎన్నికల చిహ్నాం భవితవ్యం కూడా ప్రశ్నార్థకమే. ఎన్టీఆర్‌ను చంద్రబాబు దెబ్బతీసి అధికారాన్ని, పార్టీని హస్తగతం చేసుకున్నప్పుడు ఎన్నికల చిహ్నాంతో పాటు పార్టీ నిధులు కూడా బాబు పరమయ్యాయి. ఇదే ప్రక్రియ ఇప్పుడు షిండే పరంగా జరుగుతుందా? అన్న ప్రశ్నకు కాలమే సమాధానం చెబుతుంది. ప్రాంతీయ పార్టీలు, ఉప ప్రాంతీయ పార్టీలలో జాతీయ పార్టీల మాదిరి ఒక విధానం, అంతర్గత ప్రజాస్వామ్యం పుటం వేసినా కనిపించవు. అన్నాడీఎంకే అధినేత్రి దివంగత జయలలిత హయాంలో నోరు విప్పడానికి అందరూ భయపడేవారు. తెలంగాణలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ నాయకత్వం ముందు అందరూ దాసానుదాసులే తప్పించి మాట్లాడటానికి సాహసించేవారు ఎవ్వరూ లేరు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి నాయకత్వం కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఈ ఇద్దరు ముఖ్యమంత్రులను కలవడానికి శాసనసభ్యులు నానాగడ్డి కరవవలసి వస్తుందని విమర్శలు ఉన్నాయి. పనిచేసినా చేయక పోయినా చంద్రబాబు శాసనసభ్యులను అడపా తడపా కలుస్తూ ఉండేవారు. ప్రస్తుతం ఆంధ్ర, తెలంగాణలలో ఈ ప్రక్రియ ఏ కోశానా కనిపించడం లేదు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని పోగొట్టుకున్న ఉద్ధవ్ ఠాక్రే అనుభవాలు ప్రాంతీయ పార్టీల అధినేతలకు కనువిప్పు కావాలి.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు

సంజయ్ రౌత్‌కు బెయిలబుల్ వారెంట్ !

ముంబై: ఇప్పటికే ఈడీ కేసులతో సతమతమవుతున్న శివసేన సీనియర్ నాయకుడు, ఎంపీ సంజయ్ రౌత్ కు మరో కేసులో బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. బీజేపీ మాజీ ఎంపీ కిరీట్ సోమయ్య భార్య మేధా సోమయ్య దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఈ వారెంట్ వచ్చింది. ఈ కేసులో రౌత్ రౌత్ విచారణకు హాజరుకాకపోవడంతో కోర్టు సోమవారం బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. సెవ్రీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు గత నెలలో రౌత్‌కు వ్యతిరేకంగా సమన్లు జారీ చేసి, జులై 4వ తేదీ (సోమవారం) తన ముందు హాజరుకావాలని గతంలో కోరింది. అయితే రౌత్ లేదా ఆయన తరఫున న్యాయవాదులు సోమవారం కోర్టుకు హాజరుకాలేదని మేధా సోమయ్య తరపు న్యాయవాది వివేకానంద్ గుప్తా తెలిపారు. అందుకే తాము ఆయనపై వారెంట్ జారీ కోసం దరఖాస్తు చేశామని అన్నారు. దానిని కోర్టు అనుమతించిందని చెప్పారు. ఈ దరఖాస్తును పరిశీలించిన అనంతరం ఈ కేసు విచారణను జులై 18కి వాయిదా వేసింది.

మధ్యంతర ఉత్తర్వులుంటే
ఎలా అరెస్టు చేస్తారు?

ఆశ్చర్యంగా ఉందంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూదిల్లీ: నిర్దిష్ట మధ్యంతర ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఓ కేసుకు సంబంధించి కస్టడీలో ఉన్న వ్యక్తిపై పోలీసులకు నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యు) అందడం ఆశ్చర్యం, విచిత్రం అని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. అతడిని అరెస్టు చేయరాదని స్పష్టం చేసింది. మహారాష్ట్రలోని లాతూర్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌కు సంబంధించి తనను అరెస్టు చేయరాదని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై గత ఏడాది మే 7న ఉన్నత న్యాయస్థానం నోటీసు జారీ చేసిందని, మరే ఇతర కేసులో అవసరం లేకుంటే పిటిషనర్‌ను ఈరోజే విడుదల చేయాలని, వెంటనే దానికి సమ్మతి తెలపాలని, ఈలోగా, ఎఫ్‌ఐఆర్‌కు సంబంధించి అతన్ని అరెస్టు చేయరాదని, సుప్రీంకోర్టు పేర్కొన్నట్టు న్యాయమూర్తులు దినేష్ మహేశ్వరి, కృష్ణ మురారిలతో కూడిన వెకేషన్ బెంచ్ తెలిపింది.

ఎఫ్‌ఐఆర్‌కు సంబంధించి పిటిషనర్‌ను అరెస్టు చేయరాదని నిర్దిష్ట మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పిటిషనర్‌పై ప్రాసిక్యూషన్... నాన్-బెయిలబుల్ వారెంట్లు పొందడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొంది. కాగా తన అరెస్టును ఎత్తిచూపుతూ... విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. 'అయితే, ప్రస్తుతం మేము ఈ విషయంలో వేరే వ్యాఖ్య చేయడం లేదు... ఈ దరఖాస్తుపై ప్రతిస్పందనను దాఖలు చేయడానికి రాష్ట్ర న్యాయవాదికి కొంత సమయం మంజూరు చేస్తున్నాము' అని వెకేషన్ బెంచ్ పేర్కొంది. తదుపరి విచారణను జులై 7వ తేదీకి వాయిదావేసింది. తన ఆర్డర్‌ను మెయిల్ ద్వారా మేజిస్ట్రేట్‌కు తెలియజేయాలని, దాని కాపీని తక్షణమే తగిన సూచనల కోసం రాష్ట్రం తరపు న్యాయవాదికి అందించాలని బెంచ్ తెలిపింది. విచారణ సందర్భంగా, ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీ ఎన్‌బీడబ్ల్యుని ఎలా పొందింది? మేజిస్ట్రేట్ ఉత్తర్వులను ఎలా జారీ చేశారన్న విషయమై బెంచ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఇది ఆశ్చర్యకర, దిగ్భ్రాంతి కలిగించే పరిమితులను కూడా దాటుతుంది' అని బెంచ్ పేర్కొంది. 'ఇది మీ విశ్వాసాన్ని కూడా ప్రశ్నిస్తుంది. మీరు నాన్-బెయిలబుల్ వారెంట్‌ను ఎలా పొందుతారు?' అని రాష్ట్రం తరపు న్యాయవాదికి ధర్మాసనం తెలిపింది. పిటిషనర్‌ను నిర్బంధించడం చట్ట విరుద్ధమని, అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించడమేనని బెంచ్ వ్యాఖ్యానించింది. భారత శిక్షాస్మృతి కింద మోసం చేయడంతో సహా ఆరోపించిన వివిధ నేరాలకు సంబంధించి నమోదైన కేసులో ముందస్తు బెయిల్‌ను కోరుతూ బాంబే హైకోర్టు తన పిటిషన్‌ను తిరస్కరిస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై పిటిషనర్ గత ఏడాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత ఏడాది మే 7న, అత్యున్నత న్యాయస్థానం అతని అభ్యర్థనను విచారించిన పిమ్మట పిటిషనర్‌ను అరెస్టు చేయరాదని ఉత్తర్వు జారీ చేసింది.

మిత్రుల భవితకు మోదీ భద్రత: రాహుల్

న్యూదిల్లీ: మిత్రులకు దేశాన్ని దోచిపెడుతున్న ప్రధాని నరేంద్రమోదీ... యువతను మాత్రం నిరుద్యోగులుగా మార్చివేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. విదేశాల్లో సైతం తన మిత్రుల భవిష్యత్‌కు భద్రత కల్పిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర పారామిలిటరీ బలగాలకు సంబంధించిన సిబ్బంది నియామకం కోసం పరీక్షలు రాసి..ఇంకా చేతికి నియామక పత్రాలు రాక రోడ్లపై తిరుగుతున్న యువతీ, యువకుల వీడియోలను రాహుల్ షేర్ చేశారు. ఇద్దరు, ముగ్గురు తన సంపన్న మిత్రుల కోసం దేశాన్ని కట్టబెట్టడమే కాకుండా విదేశాల్లో సైతం భద్రత కల్పిస్తున్న మోదీ...సొంత దేశంలోని యువతను నిరుద్యోగులుగా ఉంచుతున్నారని రాహుల్‌గాంధీ హిందీలో ట్వీట్ చేశారు. సైన్యంలో చేరాలనుకునే యువత 2018లోనే పరీక్షలు రాసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. సైన్యంలో నియామకాల కోసం ఏడాదిన్నరగా ఆందోళనలు చేస్తున్నారు. నాగపూర్ నుంచి దిల్లీ వరకు భారీ ప్రదర్శన చేశారు. దీనికి సంబంధించిన వీడియోను రాహుల్ పోస్టు చేశారు.

అగ్నిపథ్‌పై వచ్చేవారం సుప్రీంలో విచారణ

న్యూదిల్లీ: సాయుధ బలగాల్లో నియామకాలకు సంబంధించి మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై వచ్చేవారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. వేసవి సెలవుల అనంతరం సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమవుతుందని, ఈ పిటిషన్‌లు సరైన ధర్మాసనం ముందుకు వచ్చేలా లిస్టింగ్‌లో పెడతామని జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ ఎంకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. భారత వైమానిక దళ ఆశావాదుల శిక్షణ జరుగుతోందని, వారంతా నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని ఓ పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. కేంద్రం తీసుకొచ్చిన అగ్నిపథ్‌తో వారి ఉద్యోగ జీవితం 20 ఏళ్ల నుంచి నాలుగేళ్లకు కుదించారని తెలిపారు. ఇది అత్యవసర వ్యవహారమని, దయచేసి దీనిని లిస్టింగ్ చేయాలని ధర్మాసనానికి విన్నవించారు. ఈ పథకాన్ని సవాల్ చేస్తూ మరో న్యాయవాది ఎంఎల్ శర్మ ప్రజాప్రయోజన పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు 70వేల మంది ఉద్యోగ నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని, తక్షణమే వారికి ఉద్యోగ అవకాశం కల్పించేలా ఆదేశించాలని శర్మ చెప్పారు.

బీజేపీ ఎంపీలను తక్షణమే అరెస్ట్ చేయాలి: కాంగ్రెస్

న్యూదిల్లీ: మత సామరస్యానికి భంగం కలిగించేలా రాహుల్ గాంధీకి చెందిన నకిలీ వీడియోకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు బీజేపీ ఎంపీలు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, సుబ్రత్ పాఠక్‌లపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు కాంగ్రెస్ సోమవారం తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఎంపీలతో పాటు మరో ముగ్గురిపై ఎఫ్‌ఐఆర్ నమోదైందని ఆ పార్టీ మీడియా, ప్రచార బృందం చీఫ్ పవన్ ఖేరా తెలిపారు. దిల్లీ, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ ఫిర్యాదులు చేసిందని, ఖేరా, ఆ పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ సుప్రియా శ్రీనాటే తెలిపారు. రాహుల్ గాంధీపై తప్పుడు వార్తలను ప్రచారం చేసినందుకు తమ నాయకులపై చర్యలు తీసుకోవాలని, తమ ట్విట్టర్ నుంచి వీడియోను తొలగించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు లేఖ రాయడంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దేశంలో మత సామరస్యానికి భంగం కలిగించే ఉద్దేశంతో కేంద్ర మాజీ మంత్రి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే, అది దేశద్రోహమేనని ఆమె ఆరోపించారు. రాహుల్ గాంధీకి సంబంధించిన ఫేక్ వీడియోను ప్రసారం చేసినందుకు ఓ టీవీ ఛానెల్ బహిరంగ క్షమాపణలు చెప్పింది. "సోషల్ మీడియాలో నకిలీ వార్తలను ప్రచారం చేయడం ఒక విషయం, కానీ ఉగ్రవాదులతో కుమ్మక్కైన సోషల్ మీడియాను ఉపయోగించడం అంగీకరించబడదు. దేశంలో ఇటువంటి సున్నితమైన సమయంలో, రాహుల్ గాంధీకి సంబంధించిన ఫేక్ వీడియోను ప్రచారం చేయడానికి వారు ఎలా ధైర్యం చేస్తారు. నకిలీ వార్తలను కాకుండా, ఇది కూడా కుట్రే, ఎందుకంటే ట్విటర్‌లో పోస్టులను తొలగించినప్పటికీ, వాట్సాప్ సందేశాలు చెలామణిలో ఉంటాయి, శాంతికి విఘాతం కలిగిస్తాయి"అని శ్రీనేట్ అన్నారు.

నేను అణచివేతకు గురయ్యా

మహారాష్ట్ర సీఎం షిండే ఆవేదన

ముంబై: సుదీర్ఘకాలంగా తాను అణచివేతకు గురయ్యానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యానించారు. తనను పార్టీ నుంచి బయటికి పంపాలన్న కుట్ర కారణంగానే తిరుగుబాటు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనతో తన బంధం పటిష్టమైనదని ఆయన తెలిపారు. 'ఈరోజు జరిగిన పరిణామాలు కేవలం ఒక్కరోజువి కాదు' అని షిండే చెప్పారు. విశ్వాస పరీక్షలో విజయం సాధించిన అనంతరం ఏక్‌నాథ్ షిండే అసెంబ్లీలో ప్రసంగించారు. శివసేనలో చీలిక ఏర్పడటం, షిండే నాయకత్వాన ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో ఉద్ధవ్ నేతృత్వాన గల ఎంవీఏ ప్రభుత్వం కుప్పకూలిన విషయం విదితమే. వెంటనే షిండే సీఎంగా, దేవేంద్ర ఫడ్నవిస్ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 'ఎన్నికలు అయిన తర్వాత నేనిక్కడికి వచ్చినప్పుడు సభలో చాలామంది సభ్యులు నన్ను ఎలా చూశారో అందరూ గమనించారు. సుదీర్ఘకాలంగా నేను అణచివేతకు గురవుతున్నాను. ఉద్ధవ్‌వర్గంలోని ఎమ్మెల్యే సునీల్ ప్రభు దీనికి ప్రత్యక్ష సాక్షి' అని షిండే చెప్పారు. 2019 నవంబరులో మూడు పార్టీలతో మహావికాస్ అఘాడీ ప్రభుత్వం ఏర్పడింది. దీనిపై ఎన్‌సీపీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందిస్తూ శివసేనకు ప్రమాదం ముంచుకొచ్చిందని చెప్పారని షిండే గుర్తు చేశారు. మహావికాస్ అఘాడీ ఏర్పడటానికి ముందు ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ తనతో మాట్లాడుతూ షిండే నాయకత్వంలో కాంగ్రెస్, ఎన్‌సీపీ పనిచేయాలని కోరుకోవడం లేదని చెప్పారన్నారు. ఎంవీఏ ఏర్పడిన తర్వాత శివసేనకు ప్రమాదం జరిగిందని అజిత్ పవార్ అన్నారన్నారు. మీరు ముఖ్యమంత్రి కావడానికి తాము వ్యతిరేకం కాదని కూడా చెప్పారన్నారు.

రైల్వే ఆస్తుల పరిరక్షణ కోసం
మీరట్‌లో ఆర్‌పీఎఫ్‌కు ప్రత్యేక శిక్షణ

న్యూదిల్లీ: రైల్వే ఆస్తులను సమర్థవంతంగా పరిరక్షించుకునేలా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు (ఆర్‌పీఎఫ్) ప్రత్యేక శిక్షణ ప్రారంభమైంది. మీరట్‌లోని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు (ఆర్ఏఎఫ్), అకాడమీ ఫర్ పబ్లిక్ ఆర్డర్ (ఆర్ఏపీవో) సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణను అందిస్తున్నాయి. ఇటీవల కాలంలో రైల్వే స్టేషన్లలో అల్లర్లు, ఆస్తుల విధ్వంసం వంటి ఘటనలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా అగ్నిపథ్ పథకాన్ని వ్యతిరేకిస్తూ యువత చేపట్టిన ఆందోళనలు, గతంలో సీఏఏ తదితర చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఆందోళన నేపథ్యంలో చేపట్టిన నిరసనల్లో ఆందోళనకారులు రైల్వే ఆస్తులను టార్గెట్ చేసుకున్న సందర్భాలు ఉండడంతో ఆస్తులను రక్షించుకోవడంపై ఆర్‌పీఎఫ్ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్టు రైల్వే శాఖ తెలిపింది. రైల్వే సిబ్బందికి ఇటువంటి శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారి అని పేర్కొంది. ఆందోళనల సమయంలో గుంపులు గుంపులుగా వచ్చిన నిరసనకారులు చేసే దాడులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపింది. ఇందుకు సంబంధించిన మొదటి బ్యాచ్‌కు శిక్షణ సోమవారం ప్రారంభమైనట్టు అకాడమీ అధికారులు తెలిపారు. ఇందులో 182 మంది ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. రైల్వే విభాగం నుంచి అందిన అభ్యర్థన మేరకు ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అల్లర్ల సమయంలో ఎలా వ్యవహరించాలి, ఎవరి ప్రాణాలు పోకుండా ఆయుధాలను ఎలా వినియోగించాలి, ఆందోళన కారుల మనస్తత్వం ఎలా ఉంటుంది, వారిలో ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం దిల్లీ, లక్నో, ముంబై, వారణాసి, హౌరా, హైదరాబాద్, గోరఖ్‌పూర్, గుహవాటి, కోల్‌కతా, జైపూర్, భువనేశ్వర్, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బందిని ఎంపిక చేసినట్టు ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యేల జీతాల పెంపునకు దిల్లీ అసెంబ్లీ ఆమోదం

న్యూదిల్లీ: తమ సభ్యుల జీతాలు, అలవెన్సులు 66 శాతానికి పైగా పెంపునకు సంబంధించిన బిల్లులను దిల్లీ అసెంబ్లీ సోమవారం ఆమోదించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, చీఫ్‌విప్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వేతనాల పెంపునకు సంబంధించి ఐదు వేర్వేరు బిల్లులను ప్రవేశపెట్టగా, సభ్యులు ఆమోదించారు. పెరుగుతున్న ధరలకు, ఎమ్మెల్యేల కష్టానికి అనుగుణంగా జీతాలు ఇవ్వాలని సభ్యులు ఉద్ఘాటించారు. ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మాట్లాడుతూ, 'ప్రతిభావంతులైన వ్యక్తులను రాజకీయాల్లోకి ఆహ్వానించడానికి బహుమతులు ఉండాలి. జీతాల కారణంగా కార్పొరేట్లు ప్రతిభావంతులైన వ్యక్తులను పొందుతారు. బీజేపీ ఎమ్మెల్యే, దిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రాంవీర్ సింగ్ బిధూరి కూడా జీతాల పెంపునకు మద్దతు పలికారు.

ప్రతిపక్ష నాయకుడిగా అజిత్ పవార్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఎన్సీపీ నేత అజిత్ పవార్ సోమవారం ఎంపికయ్యారు. జూన్ 30న డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్ తర్వాత ఆయన బాధ్యతలు చేపట్టారు. 288 మంది సభ్యుల సభలో ఎన్సీపీ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించిందని, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పవార్ బాధ్యతలు స్వీకరిస్తారని స్పీకర్ రాహుల్ నర్వేకర్ ప్రకటించారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే పరిణతి చెందిన రాజకీయవేత్త , పరిపాలకుడు అని అజిత్ పవార్ అభివర్ణించారు.

పసికందు అపహరణ... తల్లీ, కుమార్తె అరెస్ట్

కోయంబత్తూరు: ఐదేళ్ల చిన్నారిని అపహరించిన కేసులో తల్లీ, కుమార్తెను సోమవారం కేరళలోని పాలక్కాడ్‌లో అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరిద్దరూ కలిసి పోలాచ్చిలోని ప్రభుత్వ ఆస్పత్రిని నుంచి ఐదేళ్ల చిన్నారిని అపహరించారని పేర్కొన్నారు. వారిద్దరినీ షమీనా(34), ఆమె కుమార్తె(14)గా గుర్తించారు. వీరిద్దరూ పాలక్కాడ్‌కు చెందినవారే. ప్రస్తుతం విచారణ చేపట్టినట్టు వివరించారు. అప్పుడే పుట్టిన పసికందు ఆదివారం ఆస్పత్రి అహరణకు గురైంది. ఇందుకోసం పోలీసులు 12 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపుచర్యలు చేపట్టారు. పోలీసులు వివిధ ప్రదేశాల్లో సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. పొలాచ్చి నుంచి వీరిద్దరూ పసికందును తీసుకుని పాలక్కాడ్‌కు వెళ్లేందుకు బస్‌స్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకోగా, అక్కడ వీరిని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాలక్కాడ్ వద్ద కొడువాయూర్ వద్ద ప్రత్యేక బృందాలు పసికందును కాపాడి ఉదయం 5 గంటల సమయంలో తల్లి దివ్యభారతికి అప్పజెప్పారు.

మెట్రో రైలు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

న్యూదిల్లీ: మెట్రో ఎల్లో లైన్‌లోని స్టేషన్‌లో సోమవారం గుర్తు తెలియని ఓ మహిళ కదులుతున్న రైలు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. జోర్‌బాగ్ మెట్రో స్టేషన్‌లో ఈ ఘటన జరగడంతో కారిడార్‌లోని ఒక సెక్షన్‌లో సర్వీసులు కొద్దిసేపు ఆలస్యమయ్యాయి. రైలు హుడా సిటీ సెంటర్ వైపు వెళ్తుండగా మహిళ ప్లాట్‌ఫారమ్ నుంచి దూకిందని, రైలు ఢీకొట్టడంతో మృతి చెందిందని అధికారులు తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ గుర్తుతెలియని మహిళ 'సల్వార్ కమీజ్' ధరించి కదులుతున్న మెట్రో రైలు నుంచి దూకడంతో తలకు తీవ్ర గాయమైందని పోలీసులు తెలిపారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పుడే చనిపోయిందని వైద్యులు ప్రకటించారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, ఆమె ఎవరనేది నిర్ధారించిన తర్వాత పోస్ట్‌మార్టం నిర్వహిస్తామని పోలీసులు వివరించారు. ఎల్లో లైన్ దిల్లీలోని సమయపూర్ బద్లీ-గుర్గావ్‌లోని హుడా సిటీ సెంటర్‌ను కలుపుతుంది.

మధ్యప్రదేశ్‌లో వర్షాలు... కాషాయ, పసుపు హెచ్చరికలు జారీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని 15 జిల్లాల్లో గడచిన 24 గంటల్లో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. అయితే భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న తరుణంలో భారత వాతావరణ శాఖ సోమవారం మధ్యాహ్నం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ రెండు ఎల్లో అలర్ట్‌లను కూడా జారీ చేసింది. ఒకటి ఖాండ్వా జిల్లా భోపాల్ నర్మదాపురం డివిజన్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రెండోవది భోపాల్, ఇండోర్, జబల్‌పూర్ గ్వాలియర్‌లతో సహా10 డివిజన్‌లలో మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ హెచ్చరికలన్నీ మంగళవారం వరకు చెల్లుబాటు అవుతాయని ఐఎండీ అధికారి ఒకరు తెలిపారు. జబల్‌పూర్, బాలాఘాట్, మాండ్లా, సత్నా, అనుప్పూర్, షాహ్‌దోల్, ఉమారియా, దిండోరి, కట్నీ, నార్సింగ్‌పూర్, చింద్వారా, సియోని, సాగర్, దామోహ్, ఛతర్‌పూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలర్ట్ హెచ్చరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్తర ఒడిశాపై అల్పపీడనం ఏర్పడడం, మరికొన్ని కారణాల వల్ల మధ్యప్రదేశ్‌కు తేమ వచ్చిందని, దీనివల్ల వర్షాలు కురుస్తున్నాయని సింగ్ తెలిపారు.

16 వేల కొత్త కేసులు.. 24 మరణాలు

న్యూదిల్లీ: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. తాజాగా 3.32 లక్షల మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 16,135 మందికి వైరస్ పాజిటివ్‌గా తేలింది. ముందురోజు కూడా అదే స్థాయిలో కొత్త కేసులు వెలుగుచూశాయి. మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, పశ్చిమ్ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో వైరస్ ఉద్ధృతి కనిపిస్తోంది. పాజిటివిటీ రేటు 4.85 శాతానికి చేరింది. ఇప్పటివరకూ 4.35 కోట్ల మందికి పైగా కరోనా బారినపడ్డారని సోమవారం కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుత వ్యాప్తితో క్రియాశీల కేసులు 1,13,864కి చేరాయి. క్రియాశీల రేటు 0.26 శాతానికి పెరగ్గా.. రికవరీ రేటు 98.53 శాతానికి పడిపోయింది. నిన్న 13,958 మంది కోలుకున్నారు. 24 గంటల వ్యవధిలో 24 మంది ప్రాణాలు కోల్పోగా.. మొత్తంగా 5.25 లక్షల మందికి పైగా మరణించారు. ఇప్పటివరకూ 197 కోట్లకు పైగా టీకా డోసులు పంపిణీ అయ్యాయి. నిన్న సెలవురోజు కావడంతో 1,78,383 మంది మాత్రమే టీకా తీసుకున్నారు.

విలాస వస్తువులపై
28% పన్ను కొనసాగింపు

ప్రభుత్వ ఉద్దేశాన్ని వెల్లడించిన రెవెన్యూ కార్యదర్శి

న్యూదిల్లీ: విలాస, అత్యవసరం కాని వస్తువులపై 28 శాతం ఉన్న జీఎస్టీ శ్లాబ్‌ను కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే 5, 12, 18 శాతం మూడు శ్లాబ్‌లను రెండుగా కుదించడంపై చర్చించడానికి సిద్ధంగా ఉందని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి తరుణ్ బజాజ్ సోమవారం తెలిపారు. అసోచామ్ నిర్వహించిన కార్యక్రమంలో పరిశ్రమల యజమానులను ఉద్దేశించి బజాజ్ మాట్లాడుతూ... జీఎస్టీ అమలులోకి ఐదేళ్ల తర్వాత పన్ను రేట్ల హేతుబద్ధీకరణపై జీఎస్టీ మండలి కసరత్తు ఆత్మశోధనగా ఫలితంగా ఉంది. పన్ను రేట్లను తటస్థ ఆదాయ స్థాయి (15.5%) కి పెంచడానికి విధాన రూపకర్తల వద్ద మంత్రదండం ఏమీలేదని చెప్పారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలనే పరిశ్రమ డిమాండ్‌పై ఆయన మాట్లాడుతూ... తమ ఆదాయంలో ఇంధనం ఎక్కువ భాగాన్ని కలిగి ఉన్నందున, కేంద్రం, రాష్ట్రాలు రెండూ కొంత ఆందోళనతో ఉన్నాయన్నారు. మనం కొంత సమయం వేచి ఉండాలని పేర్కొన్నారు. 'పన్ను రేట్లు 5, 12, 18, 28 శాతంలో, ఇంకొంత కాలం కొనసాగవలసి ఉంటుంది, ఎందుకంటే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో, అనేక ఆదాయ అసమానతలు ఉన్న ఆర్థిక వ్యవస్థలో అధిక పన్ను రేట్లను ఆకర్షించే కొన్ని విలాస, అత్యవసరం కాని వస్తువులు ఉంటాయని చెప్పారు. 5, 12, 18శాతంలో అయినా, 2 దశలుగా పన్ను రేట్లను కుదించవచ్చు కానీ ఆపై దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది? దానిని ఏ స్థాయిలోనైనా ఒకే రేటుకు తీసుకురాగల సామర్థ్యం ఉందా లేదా చూడాలని, ఇది కష్టమైన సవాల్ అని బజాజ్ అన్నారు.

నెలలోగా జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌పై మంత్రుల కమిటీ సిఫార్సులు

జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుపై ఆర్థిక మంత్రుల కమిటీ నెల రోజుల్లోగా సిఫార్సులను ఇచ్చే అవకాశం ఉందని తరుణ్ బజాజ్ వెల్లడించారు. వస్తు సేవల పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్‌టీఏటీ) రాజ్యాంగానికి సంబంధించి రాష్ట్రాలు లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించడానికి మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన గత వారం సమావేశమైన జీఎస్టీ మండలి నిర్ణయించింది. నెలరోజుల్లోగా మంత్రుల బృందం తుది సిఫార్సులను అందుతాయని ఆశిస్తున్నామని, రాబోయే 6 నెలల్లో ట్రిబ్యునల్ విషయంలో చాలా పురోగతిని చూస్తామని బజాజ్ చెప్పారు. జీఎస్టీ సెక్రటేరియట్ త్వరలో మంత్రుల బృందంలో ఉండే సభ్యుల పేర్లు, సంబంధిత మార్గదర్శకాలను వెల్లడించనుంది. జీఎస్టీఏటీలో సాంకేతిక సభ్యుల సంఖ్య జ్యుడీషియల్ సభ్యుల సంఖ్యను మించకూడదని మద్రాస్ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో మంత్రుల బృందం రాష్ట్రాల ఆందోళనలను పరిష్కరించే అవకాశం ఉంది. కేంద్ర జీఎస్టీ చట్టంలో తగిన సవరణల కోసం కొత్త కమిటీ సిఫార్సులను కూడా చేస్తుంది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) చైర్మన్ వివేక్ జోహ్రీ మాట్లాడుతూ...పన్ను చెల్లింపుదారుల ఫిర్యాదులను ఎలక్ట్రానిక్ పద్ధతిలో పరిష్కరించడానికి బోర్డు ఒక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. జీఎస్టీ వాపసుల పెండింగ్‌లు తగ్గుముఖం పట్టాయని, నష్ట భయం ఉన్న ఎగుమతిదారులకు రీఫండ్‌లను జారీ చేయడానికి మొత్తం విలువ గొలుసును పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని జోహ్రీ అన్నారు.

భారతీయ మత్స్యకారులను విడిపించాలి

కేంద్రానికి సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై: శ్రీలంక ప్రభుత్వం అదుపులో ఉన్న 12 మంది భారతీయ మత్స్యకారులను విడిపించే చర్యలు చేపట్టాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కేంద్రాన్ని అభ్యర్థించారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్‌కు సోమవారం లేఖ రాశారు. భారత్‌కు చెందిన 12 మంది జాలరులను శ్రీలంక నావికా దళం అరెస్టు చేసిందని ఆ లేఖలో పేర్కొన్నరు. ఇందులో తమిళనాడుకు చెందిన వారు ఏడుగురు, పుదుచ్చేరికి చెందిన వారు ఐదు మంది ఉన్నారని తెలిపారు. వారంతా అమాయకులని పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లిన వారిని బోటుతో సహా శ్రీలంక నావికాదళం అదుపులోకి తీసుకుందని పేర్కొన్నారు. చలా కాలం విరామం అనంతరం ఈ మధ్యనే చేపల వేట ప్రారంభమైందని ఈ క్రమంలో ఈ ఘటన మత్స్యకారుల్లో భయాందోళనలకు దారితీస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంపై దౌత్యమార్గాల ద్వారా శ్రీలంక ప్రభుత్వంతో చర్చలు జరిని అరెస్టయిన జాలరులను వెంటనే విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

స్వయం సమృద్ధికి సహకార రంగం కీలకం: షా

న్యూదిల్లీ: భారత్‌ను స్వయం సమృద్ధిగల దేశంగా తీర్చిదిద్దడంలో సహకార రంగం పాత్ర కీలకమని కేంద్ర సహకారశాఖమంత్రి అమిత్‌షా చెప్పారు. దేశంలో 709 కోట్లమంది పేదలకు సహకారం రంగం చేయూత అందిస్తోందని తెలిపారు. 70కోట్లమంది పేదలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు సహకార బ్యాంకులు తోడ్పాటు అందించాలని కేంద్ర హోంమంత్రి కూడా అయిన అమిత్‌షా సూచించారు. సహకార రంగానికి సంబంధించి 100వ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన సభలో అమిత్‌షా ప్రసంగించారు. పేదల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వం గడచిన 8 ఏళ్లలో అనేక కార్యక్రమాలు ప్రారంభించిందని షా చెప్పారు. అంతేకాకుండా విద్యుత్ అందించడం, వంటగ్యాస్, గృహ, ఆరోగ్య బీమా వంటి సదుపాయాలు కల్పించిందని చెప్పుకొచ్చారు. 70 కోట్లమంది పేదలు ఉత్తమ జీవితాలు గడపాలని కోరుకుంటున్నారని, సహకారం రంగం ఒక్కటే దీనిని పరిపూర్తి చేయగలదని అమిత్‌సా తెలిపారు. గరీబ్ హఠావో అంటూ కాంగ్రెస్ కేవలం నినాదాలు మాత్రమే ఇచ్చిందని, దారిద్ర్య నిర్మూలనకు ఆ పార్టీ చేసిందేమీ లేదని ఆరోపించారు. కేపిటలిజం, కమ్యూనిజం అనేవి పాలనకు సంబంధించి చాలా తీవ్రమైన రూపాలని, దేశానికి సహకారరంగం ఒక్కటే అభివృద్ధి నమూనాకు ఆలంబన అని వ్యాఖ్యానించారు.

నజాఫ్‌గఢ్ కాలువలో భారీగా చేపల మృతి

విచారణకు ఆదేశించిన దిల్లీ ప్రభుత్వం



న్యూదిల్లీ: దిల్లీ-హర్యానా రాష్ట్రాల సరిహద్దులోని నజఫ్‌గఢ్ కాలువలో భారీగా చేపలు మృతి చెందిన విషయం వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ అధికారులు చెట్ల పెంపకం కోసం ఆ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తుండగా భారీగా చేపలు చనిపోయి ఉండడాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. గత కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో లక్షల సంఖ్యలో చేపలు మృతి చెందినట్టు అధికారులు గుర్తించారు. గతంలో ఎన్నడూ లేనంతగా లక్షల సంఖ్యలో చేపలు మృతి చెందిన వ్యవహారంపై దిల్లీ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. చేపలు మృతిపై కాలువ సమీపంలోని జుల్‌జులీ గ్రామంలోని చెరువులోనూ ఇదే తరహాలో చేపలు చనిపోయినట్టు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న పీటీఐ బృందం అక్కడున్న తాజా పరిస్థితిని అంచనా వేసింది. లక్షల సంఖ్యలో చేపలు చనిపోవడంతో కాలువ ప్రాంతం, ఒడ్డున అంతా కుళ్లిన దుర్వాసనతో నిండినట్టు నివేదించింది. రెండు రాష్ట్రాల సరిహద్దులోని రావ్తా గ్రామం నుంచి దన్సా డ్యామ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగిందని తెలిపింది. యమునా నది తరువాత అంత స్థాయి నీటివనరుగా గుర్తింపు ఉన్న నజాఫ్‌గఢ్ నది వద్ద ఇటువంటి పరిస్థితి లేదని తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంపై రకరకాల వ్యాఖ్యానాలు వ్యక్తమయ్యాయి. సరైన కారణాలు మాత్రం ఇప్పటికీ వెలుగులోకి రాలేదని పోలీసులు తెలిపారు. ఘటనపై స్పందించిన దిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ సీనియర్ అధికారి ఒకరు పీటీఐతో మాట్లాడుతూ ఆదివారం ఆ కాలువ నుంచి నీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపినట్టు పేర్కొన్నారు. నీటిలో ఆక్సిజన్ శాతం తదితర అంశాలపై పరీక్షలు జరుగుతాయని తెలిపారు. దీని వెనుక కుట్రకోణం ఉందా అనే విషయంపైనా విచారణ జరుపుతున్నట్టు వివరించారు. ఇదిలా ఉండగా ఇంత పెద్ద స్థాయిలో మత్స్య సంపదకు నష్టం వాటిల్లడం వెనుక ఆ కాలువ గుండా అత్యధిక స్థాయిలో కాలుష్యకారకాల ప్రవాహం ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో పేరు చెప్పడానికి ఇష్టపడని అటవీశాఖ అధికారి ఒకరు ఈ అంశాన్ని ధృవీకరించారు.

స్వతంత్ర తమిళనాడుకు దారితీయొద్దు: రాజా

చెన్నై : రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి కల్పించండిగానీ వేరుపడేలా రెచ్చగొట్టొద్దు అని ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షానుద్దేశించి డీఎంకే నేత ఎ.రాజా అన్నారు. పట్టణ స్థానిక సంఘాల ప్రతినిధులతో పార్టీ సమావేశంలో రాజా మాట్లాడారు. ద్రవిడ ఉద్యమం చిహ్నం అయినాగానీ స్వతంత్ర తమిళనాడు పక్షానే థంతై పెరియార్ నిలిచారని, డీఎంకే అందుకు దూరంగా ఉంటూ వచ్చింది అని అన్నారు. పెరియార్‌ను పార్టీ అంగీకరించింది, సమగ్రత, ప్రజాస్వామ్యానికి మద్దతిచ్చిందిగానీ 'లాంగ్ లివ్ ఇండియా' (దేశచిరకాలం వర్ధిల్లాలి)కి పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. 'అమిత్‌షా, మోదీలకు వినయంగా కోరుతున్నాను. వేదికపై మా నేతల సమక్షంలో చెబుతున్నాను. అన్న (మాజీ సీఎం, డీఎంకే వ్యవస్థాపకుడు) మార్గాన్నే ముఖ్యమంత్రి అనుసరించారు. పెరియార్ మార్గాన్ని అనుసరించేలా బల వంతం చేయొద్దు. ప్రత్యేక దేశం కోసం డిమాండు చేసేలా చేయొద్దు. మా రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి ఇవ్వండి.. దానిని సాధించే వరకు విశ్రమించం' అని రాజా తేల్చిచెప్పారు.

నేటి నుంచి ఉపరాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్లు

న్యూదిల్లీ: ఆగస్టు 6న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నది. జులై 19వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పదవీకాలం ఆగస్టు 10వ తేదీతో ముగుస్తుంది. జులై 20న నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ జులై 22. తదుపరి రాష్ట్రపతి ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేటెడ్ సభ్యులతో పాటు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఎక్కువగా ఉండటంతో ఎన్‌డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ము గెలుపు సునాయాసంగా బీజేపీ భావిస్తోంది. ఉపరాష్ట్రపతి అభ్యర్థులను రాజకీయ పార్టీలు ఇంకా ప్రకటించలేదు. ఉపరాష్ట్రపతి రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. రాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంటు ఉభయసభల సభ్యులు 788 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారు. రహస్య పద్ధతిలో ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. ప్రతి అభ్యర్థి అత్యధికంగా నాలుగు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చు. ఎన్నికల డిపాజిట్ రూ.15 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

సహకార రంగంలో రెండంచెల విధానం

- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి
- ఇది రైతులకు, ఉద్యోగులకు మేలు
- మహాధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై ప్రతాప్‌రెడ్డి, గద్దె రామ్మోహన్, రాధాకృష్ణమూర్తి, రావులపల్లి రవీంద్రనాథ్, తోట రామారావు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా సహకార రంగంలో రెండంచెల విధానాన్ని అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ సీసీబీఈఏ) ఆధ్వర్యంలో సహకారరంగం, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మహాధర్నా నిర్వహించారు. దీనికి ఏపీసీసీబీఈఏ కార్యనిర్వాహక అధ్యక్షుడు వై.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ... రెండంచెల విధానం తీసుకొస్తే, ప్రభుత్వంపై ఎలాంటి భారం ఉండబోదన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 13 ఉమ్మడి జిల్లాల్లో 13మందిని డీసీసీబీ చైర్మన్లను చేశారని, వారిలో చాలా మందికి సహకార రంగంపై అవగాహన లేదన్నారు. వైఎస్, చంద్రబాబు హయాంలో డీసీసీబీ చైర్మన్లను అర్హత గల వారికీ, రైతాంగానికే కేటాయించే వారని చెప్పారు. జగన్... సహకార రంగంపై అవగాహన లేని వారికి పదవులు కేటాయించడంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. ఇవాళ ధర్నా జరగబోదంటూ వైసీపీ శ్రేణులే సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ఏంటని, ఎందుకు అంత దిగజారాలని ప్రశ్నించారు. రెండంచెల విధానాన్ని ఒక్క సహకార రంగ నేతలే కోరడం లేదనీ, ఆర్‌బీఐ సైతం ప్రభుత్వా నికి తగిన సూచనలిచ్చిందన్నారు. గతంలో ఏ పోరాటం జరిగినా, కో–ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ముందుండేదని ప్రశంసించారు. ఈ యూనియన్ అనుకున్నది సాధించి తీరుతుందని, ఎవరెన్ని ఆటంకాలు కల్పించినా, డిమాండ్లు సాధించేంత వరకు ఉద్యోగులు ఉద్యమిం చాలని, వారికి సీపీఐ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ... రెండంచెల విధానంతో రైతులపై పడే భారం తగ్గుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ... రెండంచెల విధానంతో అటు రైతాంగానికీ, ఇటు ఉద్యోగులకూ మేలు చేకూరుతుందన్నారు. సీఎం జగన్ స్పందించి ఈ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ... ప్రభుత్వ విధానాలు, మార్పులు... సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు, సహకార రంగంలో ఉన్న రైతులకు, ఉద్యోగస్తులకు ఉపయోగ పడేలా ఉన్నప్పుడు స్వాగతిస్తా మన్నారు. ప్రభుత్వం దుర్బుద్ధితో నూతన విధానాలు అమలు చేస్తే ప్రతిఘటించాలని కోరారు. ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు కాటమయ్య మాట్లాడుతూ... పెన్షన్ విధానం లేకుండా ఉద్యోగులు విధులెలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రెండంచెల విధానంతో ఉద్యోగులు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

రెండంచెల విధానంతో బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టం: తోట రామారావు

ఏపీసీసీబీఏ చైర్మన్ తోట రామారావు మాట్లాడుతూ... రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల్లో భాగంగా, బ్యాంకుల వ్యవస్థ పటిష్టత కోసం రెండంచెల విధానం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీసీసీబీఈఏ వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ... రెండంచెల సహకార వ్యవస్థ ఆవశ్యకత, లాభాలను వివరించారు. ఏఐసీబీఈఎఫ్ చైర్మన్ ఏవీ కొండారెడ్డి మాట్లాడుతూ... వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు పని చేస్తున్నాయని చెప్పారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఏపీటీబీ ఈఎఫ్ కార్యదర్శులు వర్మ, బి.బాబు, కృష్ణా డిస్ట్రిక్ బ్యాంక్ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఏపీపీఏ సీఎస్ఈఏ ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, కృష్ణా యూనిట్ ప్రెసిడెంట్ కొండలు శర్మ, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య తదితరులు ప్రసంగించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్, నాయకుడు ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలను ఆలపించారు. వివిధ జిల్లాల నుంచి సహకార బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్‌లో అమానుషం

గిరిజన మహిళకు చిత్రహింసలు

బెల్టుతో కొట్టి.. చెప్పుల దండ వేసి ఊరేగింపు: 12 మంది అరెస్టు

దేవాస్: మధ్యప్రదేశ్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న దేవాస్ జిల్లాలోని 32ఏళ్ల గిరిజన మహిళను చిత్రహింసలకు గురిచేశారు. చీర లాగేసి బెల్టుతో కొట్టి చెప్పుల దండ వేసి భర్తను భుజాలపై ఎక్కించి గ్రామంలో ఊరేగించి అవమానించారు. పురుషులు దాడి చేయగా దెబ్బలను తాళలేక కింది పడిపోయిన మహిళను ఆమె భర్త జుట్టు పట్టుకొని కొడుతున్న వీడియోలు వైరల్ అయ్యాయి. ఓ వృద్ధురాలు మరొక వ్యక్తి అడ్డుపడినా ఫలితం లేదు. మహిళ నేలపై పడిపోయినాగానీ అంతా తమాషా చోద్యం చూశారేగానీ ఆమెను కాపాడే ప్రయత్నం చేయలేదు. ఈ ఘటన దేవాస్ జిల్లా బోర్పాదావ్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈమెకు ముగ్గురు సంతానం. 26 ఏళ్ల ప్రేమికుడి ఇంటి వద్ద ఆమెను గుర్తించిన క్రమంలో మహిళను పురుషులు శిక్షించారు. ఆమెపై దాడి జరిగిన సమయంలో ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అక్కడే ఉన్నారు. మహిళ కనిపించడం లేదంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.అనంతరం తన ప్రేమికుడి ఇంట్లో ఉండటాన్ని గుర్తించారు. వివాహిత అయి మరొకరితో సంబంధం పెట్టుకున్నందుకు శిక్షగా గ్రామంలో పిల్లలు, పెద్దలు చూస్తుండగానే కొట్టడమే కాకుండా చెప్పుల దండ వేసి భర్తను భుజాలపై ఎక్కించి బలవంతంగా ఊరేగించారు. ఇదంతా తమ ఫోన్లలో గ్రామస్తులు చిత్రీకరించగా అందులో అంతా హేళన చేయడం కనిపిస్తోంది. రంగంలోకి దిగిన పోలీసులు 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. దాడిచేసిన వారే వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ఈ ఘటనను వైరల్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.